# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





## చిరంజీవికి విశిష్ట గౌరవం

- గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ అభినందనలు

7



## ప్రధాని నెత్తిన పచ్చి అబద్ధాలు!

- నరేంద్రమోదీకి.. జాతి ద్రోహి బరితెగింపు లేఖ
- మహాపాపాన్ని కప్పిపుచ్చుతూ తప్పుడు వాదన
- చంద్రబాబుపై అభాండాలు మోపుతూ కల్పనలు
- జగన్ చర్యపై భగ్గుమంటున్న వెంకన్న భక్తులు
- క్షమించరాని నేరమంటున్న ప్రజాగళం
- కంటకుడిని శిక్షించాలంటూ రోడ్డెక్కుతున్న ప్రజలు

తిరుమల వెంకన్న మహా ప్రసాదానికి మహాపరాధం జరిగిందన్న బాధలో భక్తులున్నారు. మూడు రోజులుగా అటు దేశంలోను, ఇటు రాష్ట్రంలోను 'మహాపచారం'పట్ల గగ్గోలు రేకెత్తుతోంది. రివర్స్ టెండరింగ్‌తో ఇంతటి మహాపరాధానికి పాల్పడిన పాపులే.. రివర్స్ రాజకీయానికీ తెరలేపడం విస్మయం కలిగించేదే. మతపరమైన మనోభావాలను ఉద్దేశపూర్వకంగా దెబ్బతీసి రాష్ట్రంలో అలజడి సృష్టించిన దుష్టులే.. సున్నితమైన అంశాన్ని రాజకీయం చేయడానికి ప్రయత్నిస్తోన్న వైనం వెంకన్న భక్తుల్లో ఆగ్రహావేశాలకు తావిస్తోంది. కాసుల కోసం వడ్డికాసుల వాడికే శఠగోపం పెట్టి, కల్తీ ప్రసాదాలను భక్తుల నోట కుక్కిన మహాద్రోహులు.. పచ్చి అబద్ధాలను ప్రధాని నెత్తిన విదిలించడం చూసి జనం గగుర్పాటుకు గురవుతున్నారు. పైగా వెంకన్నపట్ల విశ్వాసాన్ని ప్రదర్శించే కోట్లాది భక్తులే తనపై దాడి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ సాక్ష్యాత్తూ ప్రధానికే జాతి ద్రోహి జగన్ లేఖ రాయడం రాష్ట్రంలో చోటుచేసుకున్న విపరీత రాజకీయ పరిణామం. 'కలియుగ దైవమైన వేంకటేశ్వర స్వామి ప్రతిష్టను దిజార్చిన దుష్టుడే.. ఉత్తమోత్తముడినైన నాపై ప్రభుత్వ మూకలు పలువిధాల దాడి చేస్తున్నాయన్న' భావన కలిగేలా లేఖ రాయడం.. 'టీటీడీ ప్రతిష్టను దిగజార్చిన సీఎం చంద్రబాబుకు బుద్ధిచెప్పాల'ని ప్రధాని మోదీని కోరడం.. జగన్ నిజస్వరూపానికి నిలువుటద్దం! మహాపాతకుడన్న అభియోగాన్ని నివృత్తి చేయకుండానే.. 'లడ్డూ వివాదంలో వాస్తవాలు ప్రపంచానికి తెలియాలి. వాస్తవాలను నిగ్గు తేల్చాల'ని దోషే ప్రధానిని కోరడం.. రాజకీయ అలజడి సృష్టించే కుట్రే!

'నువ్వు చేసింది తప్పు కాదు, మహా పాపం, ఘోర'మంటూ సర్వమత విశ్వాసులూ వేలెత్తిచూపిస్తున్న తరుణంలోనే.. ప్రధానికి రాసిన లేఖలో పచ్చి అబద్ధాలు, వంచన వాక్యాలు పొందుపర్చాడు జగన్. దేవదేవునికి అపచారం జరిగిందన్న వేదన, బాధ కించిత్తు కూడాలేని జగన్..తనను అప్రతిష్ట పాల్జేయడానికి దేవుడి ప్రతిష్టనే దిగజారుస్తున్నారంటూ తెంపరి వాదనకు దిగడం జగన్ దుర్మార్గ రాజకీయాలకు పరాకాష్ట. ప్రపంచంముందు పాపిగా నిలబడిన జగనే.. ముఖ్యమంత్రి చంద్రబాబుపై చర్య తీసుకోమంటూ రాసిన లేఖలోని అజ్ఞానం.. అసలు దోషిత్వాన్ని బట్టబయలు చేస్తోంది. లేఖలో పచ్చి అబద్ధాలను పొందుపరుస్తూనే.. ప్రభుత్వాధినేత చంద్రబాబే అబద్ధాలు చెప్తున్నారన్నది ప్రధానికి జగన్ చేసిన ఫిర్యాదు. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏఆర్ ఫుడ్స్‌నుంచి వచ్చిన నెయ్యిని అసలు లడ్డూ ప్రసాదానికే వాడలేదని, గత జూలై 12న ఏఆర్ ఫుడ్స్ నుంచి వచ్చిన నెయ్యిలో నాణ్యతా ప్రమాణాలు లేకపోవడంతో తిరస్కరించామని ప్రధానికి రాసిన లేఖలో జగన్ పేర్కొన్నాడు. ఇంతకుమించిన పచ్చి అబద్ధం మరొకటి ఉండదు. వాస్తవానికి టిటిడి మార్కెటింగ్ విభాగం నెయ్యి కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షిస్తుంది.

- (మిగతా వివరాలు 4లో)

## శాంతిహోమంతో సన్నిధి శుద్ధి



2లో

- బ్రహ్మోత్సవాలకు ముందే పవిత్రయాగం
- ఆగమ సలహాదారుల సూచన తీసుకున్నాం
- నేడు తిరుమలలో పంచగవ్య ప్రోక్షణం
- లడ్డూ కల్తీపై ప్రజల గుండెమండింది..
- అపచార పరిహారంపై ముఖ్యమంత్రి ప్రకటన
- తిరుమల కేంద్రంగా వైసీపీ దారుణాలు
- రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారు
- అన్యమతస్తులు చైర్మన్లయ్యారు...
- భక్తుల మనోభావాలకు వాళ్లు విలువివ్వలేదు
- ప్రాయశ్చిత్తం చేసుకోకుండా వెకిలి మాటలా?
- దాణా సరిగాలేక నెయ్యి కల్తీ అయ్యిందట..
- వైసీపీపై విరుచుకుపడిన సీఎం చంద్రబాబు

## కల్తీ పాపంపై సిట్!

- దుష్టుల నిగ్గుతేల్చేందుకు వేగంగా దర్యాప్తు
- పాప పరిహారార్థం తిరుమలలో శాంతిహోమం
- వెంకన్న అన్ని ఆలయాల్లో శుద్ధి నిర్వహణ
- మత నియమాల అమలుకు అవసరమైతే చట్టం
- మతసామరస్య పరిరక్షణ సీఎంగా నా బాధ్యత
- నిర్ణయాలు ప్రకటించిన సీఎం చంద్రబాబు



2లో

## నిబంధనలకు నీళ్లొదిలి.. రివర్స్ టెండర్లు!

వైసీపీపై మండిపడిన సీఎం చంద్రబాబు 2

## పవిత్రమైన తిరుమల లడ్డూ కల్తీ దుర్మార్గం



- తప్పు చేసినవారిని జగన్ ఏ విధంగా సమర్థిస్తారు?
- ఇదే ఒక చర్చికి అపవిత్రం జరిగితే జగన్ ఊరుకుంటారా?
- జంతు అవశేషాల కల్తీ నేతితో చేసిన తిరుమల లడ్డూలు అయోధ్య రామ జన్మభూమికి పంపటం మహాపాపం
- హిందువుల మనోభావాలను దెబ్బతీసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టం
- క్యాబినెట్, అసెంబ్లీలో చర్చించి బాధ్యులపై కఠిన చర్యలు
- ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన అనంతరం మీడియాతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- నంబూరు శ్రీ దశావతార వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో దీక్ష మాలధారణ

5లో

## 'లడ్డూ' పాపం హిందూ ద్రోహి జగన్‌దే



- తప్పు కప్పిపుచ్చుకునేందుకే ప్రధానికి లేఖ
- టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పట్టాభి

- వివరాలు 6 లో..

## తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన జగన్ ప్రభుత్వం



- తెలియక స్వీకరిస్తే దోష నివారణ మార్గమేమిటి?
- టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చిరాం ప్రసాద్

- వివరాలు 8 లో..

## రోజుకో కుట్ర, పూటకో అబద్ధం



- పులివెందుల అపరిచితుడు జగన్‌కే సాధ్యం
- మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ధ్వజం

- వివరాలు 8 లో..

# శాంతిహోమంతో సన్నిధి శుద్ధి

- బ్రహ్మోత్సవాలకు ముందే పవిత్రయాగం
- ఆగమ సలహాదారుల సూచన తీసుకున్నాం
- నేడు తిరుమలలో పంచగవ్య ప్రోక్షణం
- లడ్డూ కల్తీపై ప్రజల గుండెమండింది..
- అపచార పరిహారంపై ముఖ్యమంత్రి ప్రకటన
- తిరుమల కేంద్రంగా వైసీపీ దారుణాలు
- రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారు
- అన్యమతస్థులు చైర్మన్లయ్యారు...
- భక్తుల మనోభావాలకు వాళ్లు విలువివ్వలేదు
- ప్రాయశ్చిత్తం చేసుకోకుండా వెకిలి మాటలా?
- దాణా సరిగాలేక నెయ్యి కల్తీ అయ్యిందట..
- వైసీపీపై విరుచుకుపడిన సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): 'గత పాలకులు అహం భావంతో తిరుమల పవిత్రను దెబ్బతీశారు. వారి మహాపరాధానికి అందరం క్షోభ అనుభవిస్తున్నాం. శ్రీవారి సన్నిధిని శుద్ధిచేసి శాంతిహోమంతో మళ్లీ పవిత్రత అపాదిస్తాం. జరిగిన తప్పులకు స్వామిని క్షమాపణ వేడుకుంటూ బ్రహ్మోత్సవాలకు ముందే పవిత్రయాగం చేస్తాం. ఆగమ సలహా మండలి సభ్యులు సూచన మేరకు సోమవారం ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు శ్రీవారి ఆలయంలో శాంతి హోమం, పంచగవ్య ప్రోక్షణ నిర్వహిస్తారు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఆదివారం సాయంత్రం మీడియా సమావేశంలో మాట్లాడారు.

## వైసీపీ హయాంలో పునరావాస కేంద్రంగా తిరుమల

'కోట్లాది హిందూ భక్తులంతా పవిత్రంగా భావించే మహా పుణ్యక్షేత్రం తిరుమల. ఏడు కొండలవాడినీ ఒక్కొక్కరు ఒక్కోపేరుతో పారవశ్యంగా పిలుచుకుంటారు. తిరుమలకు వచ్చి కలియుగదైవాన్ని దర్శించుకుంటే పాపహరణ జరుగుతుందని, బాధలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. అలాంటి పవిత్ర దేవాలయ ప్రతిష్టను గత పాలకులు దెబ్బతీశార'ని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. 'ఎన్టీఆర్ వైకుంఠ కాంప్లెక్స్ 1 కడితే,నేను కాంప్లెక్స్-2 కట్టాను.ఎన్టీఆర్ అన్నదానం పెడితే... నేను ప్రాణదానం తీసుకొచ్చాను. అన్నదాన కార్యక్రమం ద్వారా ఎంతమందికైనా భోజనం పెట్టొచ్చు. దానికి కార్పస్‌ఫండ్ కూడా రూ.2 వేల కోట్లు ఉంది. ప్రాణదానంలో కూడా కార్పస్‌ఫండ్ పెరుగుతోంది. దీన్ని 2003లో స్విమ్స్‌లో ప్రారంభించాం' అని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. 'బ్రహ్మోత్సవాల సమయంలో పట్టువస్త్రాలు సమర్పించడానికి వెళ్తున్న సమయంలో 23 క్లైమోర్ మైన్స్ పెట్టారు. అప్పుడు ప్రాణభిక్ష పెట్టి స్వామి నాకు పునర్జన్మనిచ్చారు. నేను ఏ పని చేసినా వేంకటేశ్వరుడిని తలచుకుని చేస్తా'నని తన విశ్వాసాన్ని చంద్రబాబు చెప్పుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి 7 కొండలు ఎందుకు, 2 కొండలు చాలు అన్నప్పుడు నేను పోరాడానని గుర్తు చేసుకుంటూ.. అలాంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో గత ఐదేళ్లూ అపవిత్ర కార్యక్రమాలకు పాల్పడ్డారని, రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలకు విలువ ఇవ్వలేదని. ప్రసాదంలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని, జరిగిన తప్పులపై గత ఐదేళ్లలో ఎన్నోసార్లు భక్తులు ఆందోళన చేసినా పట్టించుకోలేదని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు.

## విశ్వాసం లేనివాళ్లను చైర్మన్లు చేశారు

'సీఎంగా కాదు భక్తుడిగా చెప్తున్నా. వెంకటేశ్వర స్వామి ప్రసాదానికి ప్రత్యేకత ఉంటుంది. 300 ఏళ్లుగా లడ్డు తయారు చేసే విధానం, అందులో వాడే పోషకాలు నాణ్యతగా ఉంటాయి. సరుకులు సరఫరా చేసే వాళ్లు సైతం పవిత్రంగా భావిస్తారు. ఇంట్లోకి లడ్డు తెచ్చి పెడితే ఇల్లంతా సువాసన వస్తుంది. వడ, పొంగలి ప్రసాదాలు దేనికదే ప్రత్యేకత. శ్రీవారి లడ్డూకు చాలా డిమాండ్. 40 గ్రాముల ఆవునెయ్యి, 40 గ్రాముల శనగపిండి, ఇతర దినుసులు వినియోగించి 110 గ్రాముల లడ్డు తయారుచేస్తారు. 2009లో పేటెంట్ రైట్ సైతం దక్కింది. అలాంటి ప్రత్యేక లడ్డూను గత పాలకులు అధికారంలోకి రాగానే ఇష్టానుసారం చేశారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రస్ట్ బోర్డు నియామకాల్లో గ్యాంబ్లింగ్‌కు పాల్పడ్డారని, చట్టాన్ని మార్చి 50మంది నామినేటెడ్ పోస్టులు తీసుకొచ్చి రాజకీయ పునరావాస కేంద్రం చేశారన్నారు. ఎక్స్ అఫిషియో అనే విధానాన్ని తెచ్చి పెట్టిన దుర్మార్గులు, టీటీడీ టికెట్లు ఇష్టానుసారం అమ్ముకున్నారన్నారు. దేవదేవుడిపై నమ్మకంలేని వాళ్లను బోర్డు ఛైర్మన్లుగా పెట్టి.. అన్యమతస్తులకు ప్రాధాన్యమిచ్చారు. రాజకీయ ప్రయోజనాలకు టీటీడీని వాడుకున్నారు' అని చంద్రబాబు మండిపడ్డారు.

## ప్రాయశ్చిత్తం పడకుండా వెకిలి మాటలా?

గత పాలకుల హయాంలో జరిగిన అపచారాలకు ఇప్పుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష బూనారని సీఎం చంద్రబాబు అన్నారు. దేవదేవుడికి అపచారం జరిగిందని ప్రపంచమంతా బాధపడుతుంటే.. వెకిలి వేషాలేస్తున్నారని, వాళ్ల ప్రవర్తన చూస్తే మనిషి పుట్టుక పుట్టారా? అనిపిస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. రాజకీయ ముసుగులో ప్రజల్ని మోసం చేయాలని చూస్తున్నారని, ఇన్ని తప్పులు చేసి ప్రధానికి లేఖ రాయడం సిగ్గుచేటన్నారు. హిందువులంతా మండి పడుతుంటే.. అసత్యాలతో లేఖ రాసి జగన్ ఎదురు దాడికి దిగడాన్ని ఎద్దేవా చేశారు. 'కేంద్రమంత్రి రికమెండేషన్, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల రికమెండేషన్‌తో టీటీడీ బోర్డు మెంబర్లు నియమించామని లేఖలో రాశారు. బోర్డు మెంబర్లు ఏం చేయగలుగుతారు.? మీ హయాంలో టీటీడీ ఈఓ ఎవరు.. ఎక్కడినుండి వచ్చారు?' అని ప్రశ్నించారు. ఇంట్లో ఎవరైనా చనిపోతే యేడాదిదాకా తిరుమలకు వెళ్లరని, వెళ్తే అపచారంగా భావిస్తామని గుర్తుచేస్తూ.. ధర్మారెడ్డి కొడుకు చనిపోయిన 12వ రోజే తిరుమలకు రావడాన్ని ఏమనాలని నిలదీశారు. సోనియా గాంధీ, అబ్దుల్ కలాం తిరుపతి వచ్చినప్పుడు నమ్మకంతో వచ్చామని చెప్పారు. వాళ్లకంటే జగన్ గొప్పోడా? ఎందుకు డిక్లరేషన్ ఇవ్వలేదు.? టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి భార్య బైబిల్ పట్టుకుని మాట్లాడతారు. భూమన కరుణాకర్‌రెడ్డి కూతరు పెళ్లి క్రిస్టియన్ సంప్రదాయంలో చేశారు. అలాంటివాళ్లు చైర్మన్‌గిరీ ఎలా వెలగబెడతారు? అని ప్రశ్నించారు. తానూ జెరూసలెం వెళ్లానని, అక్కడి సాంప్రదాయాలు పాటించానని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. కేరళ గురువాయర్‌కు చొక్కాలేకుండా వెళ్లాలి. అది సాంప్రదాయం. ఒక్కో గుడికి ఒక్కో సాంప్రదాయం ఉంటుంది. ఒక్క టీటీడీ చైర్మన్ 3 లక్షల 75 వేల దర్శన లెటర్లు ఇచ్చారు. ఇవన్నీ చూసి షాక్ అయ్యా. విధ్వంసానికి నాంది పలికి మళ్లీ మాది చిన్న పాత్రేనని చెప్తున్నారు. అడల్ట్రేషన్ టెస్టింగ్ చేయాలంటే ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ ఉన్న ల్యాబ్‌కు వెళ్లాలి. కానీ గత ఐదేళ్లూ అలాంటి టెస్టులు లేవు. టెండర్ కండీషన్ ప్రకారం కల్తీ ఉందా లేదా? అనేది పరీక్ష చేయాలి. ఆ పరీక్షలకు అవసరమైన ల్యాబ్‌కు కనీసం రూ.70 లక్షలు ఖర్చు చేయలేకపోయారు. ఇంత అపచారం చేసి కూడా పశ్చాత్తాప పడటం లేదు' అని చంద్రబాబు వైసీపీ నేతలపై మండిపడ్డారు.

### దాణా సరిగాలేక నెయ్యి కల్తీ అయ్యిందట

ప్రధానికి రాసిన లేఖలో కల్తీ నెయ్యికి వివరణ ఇస్తూ.. ఆవులు సరైన దాణా తినలేదు. గడ్డి సరిగా తినలేదు. అనారోగ్యంతో ఉన్న ఆవుల పాలతో తయారయ్యే నెయ్యి నాణ్యత లేకపోయే అవకాశం ఉందని పేర్కొనడం సిగ్గుచేటని చంద్రబాబు ఎద్దేవా చేశారు. వీళ్లు చెబుతున్న అబద్ధాలకు సంఘ బహిష్కరణ చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. '15 వేల కేజీల నెయ్యి తయారీకి 3.75 లక్షల లీటర్ల పాలు అవసరం అవుతాయి. 37 వేల ఆవులకు మంచి గడ్డి, దాణా ఇవ్వలేదు, దాని వల్ల నాణ్యత దెబ్బతింది అని చెప్తున్నాడు. కరుడుగట్టిన నేరస్తులకే ఇలాంటి ఆలోచనలు వస్తాయి. క్షమాపణ చెప్పకుండా ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అన్ని ఆవులకు అనారోగ్యం, దాణా సమస్య ఉందా? రామతీర్థంలో రాముడి తల నరికారు. అక్కడ పోరాటానికి వెళ్తే నాపై దాడి, కేసులు పెట్టారు. జగన్‌లాంటి వ్యక్తితో రాజకీయం చేయడం జాతికే అవమానం' అని సీఎం చంద్రబాబు ఆక్షేపించారు.

# కల్తీ పాపంపై సిట్!

- దుష్టుల నిగ్గుతేల్చేందుకు వేగంగా దర్యాప్తు
- పాప పరిహారార్థం తిరుమలలో శాంతిహోమం
- వెంకన్న అన్ని ఆలయాల్లో శుద్ధి నిర్వహణ
- మత నియమాల అమలుకు అవసరమైతే చట్టం
- మతసామరస్య పరిరక్షణ సీఎంగా నా బాధ్యత
- నిర్ణయాలు ప్రకటించిన సీఎం చంద్రబాబు

ఉండవల్లి (చైతన్య రథం): ఆపద మొక్కులవాడు వేంకటేశ్వర స్వామి మహాప్రసాదానికి అపచారం జరిగిన నేపథ్యంలో.. పాప ప్రక్షాళనకు ముఖ్యమంత్రి చంద్రబాబు కఠిన నిర్ణయాలే తీసుకున్నారు. తొలుత వెంకన్నపట్ల పాపపరిహారార్థం తిరుమల ఆలయంలో శాంతిహోమం చేపడతామన్నారు. పవిత్ర ఉత్సవాలతో దోషాలు తొలగిపోయినా. ఇప్పుడు శ్రవణం వల్ల, వెలుగు చూసిన అంశాలవల్ల ఇతరదోషాలు తొలగిపోయేందుకు శాంతి హోమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారంపై దర్యాప్తుకు సిట్ వేస్తాం. ఐజీస్థాయి పర్యవేక్షణలో సిట్ ద్వారా ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేస్తున్నాం. నిర్దిష్ట సమయంలో దర్యాప్తు పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తారన్నారు. ఏ ప్రార్థనా మందిరంలో ఆ మతం వాళ్లే యాజమాన్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటా మన్నారు. దీని కోసం అవసరమైతే కొత్తచట్టం తెస్తామని ప్రకటించారు. దేవాలయాలు, మసీదులు, చర్చిల సాంప్రదాయాలకు అనుగుణంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అన్ని దేవా లయాల్లో ఆగమ శాస్త్రాల ప్రకారం అన్నిచోట్లా ప్రోక్షణ, శుద్ధి కార్యక్రమం చేపడతామన్నారు. దేవాలయాల నిర్వహణపై అన్నీ స్టడీ చేసి స్టాండర్డ్ ఆపరేషన్ తయారుచేసి వాటిని పాటించే విధానం తెస్తామన్నారు. దీని కోసం ఒక కమిటీ ఏర్పాటు చేస్తామని, మహిళలను గౌరవించేలా ప్రత్యేకమైన క్యూలు ఏర్పాటు చేసే అంశంపైనా నిర్ణయాలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

## నిబంధనలకు నీళ్లొదిలి..

# రివర్స్ టెండర్లు!

- ఇష్టానుసారం నియమాలు ఉల్లంఘించారు
- నాణ్యతకు తిలోదకాలిచ్చింది అక్కడే..
- ప్రక్షాళనలో భాగంగానే బయటపడింది..
- ల్యాబ్ రిపోర్టులను కూడా నమ్మరా..?
- అపచారానికి పాల్పడి ఎదురుదాడి చేస్తున్నారు
- వైసీపీపై మండిపడిన ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి (చైతన్యరథం): ఏళ్ల తరబడి అనుసరిస్తోన్న పవిత్ర విధానాలకు తిలోదకాలిచ్చి.. గత పాలకులు రివర్స్ టెండర్లకు పాల్పడటంతోనే దేవదేవుడికి అపచారం జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభిప్రాయపడ్డారు. తిరుమల మహాప్రసాదంలోకి కల్తీ నెయ్యి వచ్చి చేరిన వైనాన్ని ఆదివారం మీడియా సమావేశంలో నిశితంగా వివరించారు. 'నిబద్ధమైన నిబంధనలను మార్చేసి.. టెండర్లను రద్దుచేసి.. రివర్స్ టెండర్లకు వెళ్లడమే మహాపచారానికి కారణంగా కనిపిస్తోంది. తిరుమల ప్రసాదానికి ఆవు నెయ్యి సరఫరా చేయాలంటే మూడేళ్లపాటు డైరీకి అనుభవముండాలి. ఆ నిబంధనను ఏడాదికి కుదించారు. నాలుగు లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి చేయగల డైరీకే బాధ్యతలు అప్పగించాల్సివున్నా, ఆ నిబంధనను సైతం మార్చేసి.. ఎవ్వరైనా సరఫరా చేయొచ్చు అనే పద్ధతి ప్రవేశపెట్టారు. డెయిరీకి ఏడాదికి రూ.250కోట్లు కనీస టర్నోవర్ ఉండాలి. దాన్ని రూ.150 కోట్లకు కుదించారు. ఈ విధంగా తమకు అనుకూలంగా నిబంధనలు మార్చుకుని..తమిళనాడు నుంచి ఏఆర్ డెయిరీని తీసుకొచ్చారు. ఇష్టానుసారంగా వ్యవహరించిన పద్ధతే కల్తీ నెయ్యికి కారణమైంది' అని చంద్రబాబు వివరించారు. రివర్స్ టెండర్ల విధానాన్ని వివరిస్తూ.. '10లక్షల కేజీల ఆవునెయ్యికి గడచిన మార్చి 12న ఈ-టెండర్ పిలిచారు. మే 8న టెండర్ ఖరారు చేశారు. కిలో ధర రూ.319.90కి ఫైనల్ చేశారు. జూన్ 12 నుండి నెయ్యి సరఫరా మొదలైంది. ఆ క్రమంలో జూలై 6న వచ్చిన రెండు ట్యాంకులు, 15న వచ్చిన మరో రెండు ట్యాంకుల నెయ్యిలో నాణ్యత లేదని గుర్తించాం. వాటి శాంపిల్స్ తీసుకుని ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పంపితే -జంతుకొవ్వు వ్యవహారం బయటపడింది' అని చంద్రబాబు వివరించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే.. ప్రక్షాళనకు చర్యలు మొదలుపెట్టింది ప్రభుత్వం. తిరుమలలో చోటుచేసుకుంటున్న అపవిత్ర కార్యక్రమాలన్నీ ప్రక్షాళన చేసి పుణ్యక్షేత్రానికి పూర్వవైభవం తెచ్చేందుకు నాకు భగవంతుడు ఆదేశాలిచ్చాడనే భావించాను. ఈఓగా నియమించిన శ్యామలారావుకు వివరించి, పంపించాను. సరుకు సరిగ్గా సరఫరా చేయని వాళ్లకు వార్నింగ్ ఇచ్చినా వినలేదు. ఆ క్రమం లోనే నాలుగు ట్యాంకర్లలోని నెయ్యి శాంపిల్స్‌ను ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు జూలై 16న పంపిస్తే 23న రిపోర్టులు వచ్చాయి. ఆ రిపోర్టుల ఆధారంగా చర్యలు మొదలుపెట్టాం. లడ్డూలో నాణ్యత లేదు అనేది ప్రసాదం తిన్న ప్రతిఒక్కరూ చెప్పారు. రిపోర్టు 1లో ఎస్.వాల్యూ 86.62 ఉంది. కానీ ఉండాల్సింది 98.05 నుండి 101.95. దీనికి కారణం ఆలివ్,సోయా బీన్,సన్‌ఫ్లవర్, ఫిష్ ఆయిల్ ఉండటమే.రిపోర్టు 3లో 22.43ఎస్ వాల్యూ ఉంది. 95.90 నుండి 104.10 ఉండాలి. ఉండాల్సిన ప్రమాణాలు లేక పోవడానికి కారణం పామాయిల్, బీఫ్ కొవ్వు ఉండటం. నెంబర్ 4లో ఎస్ వాల్యూ 117.42 ఉండాలి. కానీ 97.96 నుండి 102.04 ఉంది. దీనికి కారణం పంది కొవ్వు ఉండటం. ఇవన్నీ చూశాక ఈవో నోటీసు ఇచ్చి నెయ్యి సరఫరా చేసే డైరీని బ్లాక్ లిస్టులో పెట్టారు' అని సీఎం చంద్ర బాబు వివరించారు.

నేను తిరుమలను ప్రక్షాళన చేయాలని చెప్పాను. దీంతో ఇవన్నీ బయటకు వచ్చాయి. చేసిన తప్పునకు క్షమాపణ చెప్పకుండా ఎదురుదాడి ప్రారంభించారు. చరిత్రలో క్షమించరాని నేరంఇది. భక్తుల మనోభావాలపట్ల గౌరవముంటే ఎదురుదాడి చేస్తారా?. మీరు ఎదురు దాడి చేస్తే మంచి వాళ్లు అని సర్టిఫికెట్ ఇవ్వాలా? గడచిన రెండు రోజుల్లో ఒక్కొక్కరి స్టేట్‌మెంట్ చూస్తే గుండె రగిలిపోతుంది. మీకు నమ్మకం లేకపోతే దూరంగా ఉండండి. సీఎంగా ఉన్నంత వరకు మతసామరస్యం కాపాడటం నా బాధ్యత.

నేను నచ్చిన దేవుడికి పూజ చేస్తానేగానీ. వేరే మతాలను ద్వేషించడం ఎప్పుడూ చేయలేదు. ఉమ్మడి రాష్ట్రంలో చర్చిలపై దాడులు జరిగితే మెదక్, తాడేపల్లిగూడెం వెళ్లి పరిశీలించి చర్యలు తీసుకున్నాను' అని చంద్రబాబు గుర్తు చేశారు.

# కష్టించినోళ్లకే పదవులు!



- త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీ
- కార్యకర్తలే బలం.. త్యాగాలను మరువను
- ఇచ్చిన హామీలు వరుసగా అమలు చేస్తున్నా
- 100 రోజుల పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- 'ఇది మంచి ప్రభుత్వ'మని చాటి చెప్పండి
- దీపావళినుంచి ఉచిత గ్యాస్ పథకం అమలు
- అపరాధానికి పాల్పడిన వైసీపీని వదిలిపెట్టను
- వైసీపీ భ్రష్టుపట్టించిన వ్యవస్థలను చక్కదిద్దుతున్నా
- మన విజయాలు ప్రజల ముంగిటకు చేరాలి
- పార్టీ శ్రేణులకు చంద్రబాబు నాయుడు పిలుపు

అమరావతి (చైతన్య రథం): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలు, నేతల త్యాగాలను విస్మరించబోమని తెలుగుదేశం పార్టీ జాతీయాధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కార్యకర్తలకు ఇచ్చే ప్రమాద బీమాను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతున్నట్టు ప్రకటిస్తూ.. స్వతహాగా ఎదిగేలా ఎంపవర్‌మెంట్ చేస్తామన్నారు. పార్టీ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంపవర్‌మెంట్ విభాగం ద్వారా యువతకు వివిధ కంపెనీలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, ఎన్ఆర్ఐ టీడీపీ విభాగం ద్వారా విద్యార్థులకు శిక్షణనిచ్చి విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నామని ప్రకటించారు. ప్రస్తుతం నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తు జరుగుతోందని, పార్టీ కోసం కష్టపడిన వారికి నామినేటెడ్ పదవుల నియామకాల్లో సముచిత ప్రాధాన్యత ఇస్తామని చంద్రబాబు ప్రకటిం చారు. ఆదివారం మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజక వర్గ ఇన్చార్జిలు, గ్రామస్థాయి పార్టీ నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. శ్రేణులతో పార్టీ జాతీయాధ్యక్షుడు చంద్రబాబు మాట్లాడుతూ.. 'కూటమిలోని మూడు పార్టీల్లో కష్టపడ్డ నేతలకు ప్రాధాన్యముంటుంది. చరిత్రలో కనీవినీ ఎరుగని విజయాన్ని ప్రజలు మనకిచ్చారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసి వ్యవస్థలను సర్వనాశనం చేసింది. నాటి వారి పాపాలే నేడు ప్రజలకు శాపాలుగా మారాయి. జగన్మోహన్‌రెడ్డి అసమర్థ పాలన వల్ల జరిగిన నష్టాన్ని ప్రజా క్షేత్రంలో వివరించాలి. కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో మనం చేసిన పనులు ప్రజలకు తెలపాలి. గత పాలకులు పాపాలను ప్రజలకు తెలియజేయాలి. సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నాం. ఇది మంచి ప్రభుత్వమని అన్ని వర్గాలు సంతోషంగా చెబుతున్నాయి. 2029 నాటికి టీడీపీని తిరుగులేని శక్తిగా మారుస్తా'మని చంద్రబాబు ప్రకటించారు.

'ప్రజల సెంటిమెంట్‌తోనూ ఆడుకునేస్థాయికి గత పాలకులు దిగజారారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి లడ్డూలో జంతువుల కొవ్వు వినియోగించారు. దోషులను వదలబోము. నేరం చేయడం, తప్పించుకోడానికి ఎదురుదాడి చేయడం అలవాటుగా మారింది. ఇలానే వదిలేస్తే అబద్ధాలను పదేపదే చెప్పి ప్రజలను మోసం చేస్తారు. అధికారం చేపట్టగానే తిరుమలనుండే ప్రక్షాళన మొదలుపెట్టాం. తిరుమలలో గోవింద నామస్మరణ తప్ప ఏ ఇతర నినాదాలు వినిపించకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాము' అని చంద్రబాబు స్పష్టం చేశారు.

'గత ప్రభుత్వం ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా యువతను తీవ్ర నిరాశలో కూరుకుపోయేలా చేసింది. ఎన్నికల హామీలో ఇచ్చిన మేరకు తొలిసంతకం మెగా డీఎస్సీ ఫైల్‌పై పెట్టాం. రాబోయే రోజుల్లో భారీఎత్తున పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాము. గత ప్రభుత్వంలో తమ ఆస్తులను ఎప్పుడు ఎవరు కబ్జా చేస్తారోనని ప్రజలు కంటిమీద కునుకు లేకుండా గడిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం చేసి ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాము. రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తున్నాము. పింఛను ఏప్రిల్, మే, జూన్ నెలలవి కూడా పింఛన్ పెంచి జూలై నెలలో రూ.7 వేలు అందించాం. ప్రతి నెలా 1నే రూ.4 వేలు అందిస్తున్నాం. 100 రోజుల్లో 175 అన్న క్యాంటీన్లు ప్రారంభించాము. మిగిలినవి త్వరలోనే ప్రారంభిస్తా. ప్రతి నియోజకవర్గానికి ఒక అన్న క్యాంటీన్ పెట్టబోతున్నాము. ప్రజల ఇసుక కష్టాలు తీర్చడం కోసం ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తెచ్చాం. లోడింగ్, సీనరేజ్, రవాణా ఖర్చులు పెట్టుకుంటే చాలు... ఇసుక కొనుగోలుకు ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు. మద్యం విధానాన్ని ప్రక్షాళన చేశాం. ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని కల్తీ మద్యాన్ని అరికట్టాం. గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తాం. 2029 నాటికి నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇచ్చే లక్ష్యంతో ఏడాదిలో 8.25 లక్షల ఇళ్ల నిర్మాణం టార్గెట్‌గా ముందుకెళ్తాం' అని పార్టీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు వివరించారు.

'విజయవాడ వరద బీభత్సానికి అతలాకుతలమైంది. బాధితులకు అండగా నిలబడ్డాం. వరదల్లో మునిగిన ఇంటికి రూ. 25 వేలు, హెక్టారు వరికి రూ.25 వేలు ఆర్థిక సాయం ప్రకటించాం. మోటార్ వెహికిల్స్ పాడయితే రూ.3 వేలు ఇవ్వడంతో పాటు, ఇంట్లోకి నీరొచ్చిన వారికి ఆర్థిక సాయం అందిస్తున్నాం. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వమిచ్చిన పిలుపును అందుకుని దాతలు ముందుకొచ్చి విరాళాలు అందిస్తున్నారు. ఆంధ్రుల జీవనాడి పోలవరాన్ని త్వరితగతిన పూర్తిచేస్తాం. జగన్ ప్రభుత్వ హయాంలో పోలవరం అనాథలా మిగిలిపోయింది. ఐదేళ్లపాటు ప్రాజెక్టు పనులు పూర్తిగా పడకేయడమే కాకుండా డయాఫ్రమ్ వాల్, కాఫర్ డ్యాంలు దెబ్బతిన్నాయి. పోలవరం ప్రాజెక్టుకు రూ.12,127 కోట్లను కేంద్రం మంజూరు చేయడమే కాకుండా... 2027 మార్చిలోగా ఫేజ్ 1ను పూర్తి చేసేందుకు షెడ్యూల్ ప్రకటించింది. వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా అమరావతిని చంపేసింది. కుల, మత, ప్రాంతాల మధ్య విద్వేషాలు రగిల్చింది. ఐదేళ్లపాటు రాజధానిలేని రాష్ట్రం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. త్వరలోనే రాజధాని పనులు మొదలుపెడతాము. అమరావతికి ప్రసిద్ధ విద్యా సంస్థలు వస్తున్నాయి. రాష్ట్రమంతటా సోలార్ వెలుగులు నింపేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నాము. భవిష్యత్‌లో థర్మల్ విద్యుత్తు వినియోగాన్ని తగ్గించి సౌర విద్యుత్ వాడకాన్ని పెంచాలి. ఎనర్జీ రంగంలో గ్రీనర్ ఫ్యూచర్ వైపు అడుగులు పడుతున్నాయి. వ్యవసాయరంగంలోనూ టెక్నాలజీని వాడుతున్నారు. రాష్ట్రంలో మూడు ఇండస్ట్రియల్ పార్కులను కేంద్రం మంజూరు చేశారు. విశాఖ రైల్వే జోన్ క్లియర్ అయింది. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులిచ్చి సహకరిస్తున్నారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్రలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీతోపాటు, విశాఖ- చెన్నై పారిశ్రామిక కారిడార్లోని నోడ్లకు ప్రత్యేక సాయం, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి కేంద్రం హామీ ఇచ్చింది' అని చంద్రబాబు వివరించారు.

'జలవనరులు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, మౌలిక వసతులకు రూ.2.5వేల కోట్లు రాష్ట్రానికి వచ్చాయి. ప్రజలంతా ఇది మంచి ప్రభుత్వమని భావిస్తున్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఖజానాలో డబ్బులు లేకపోయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటున్నాం. గత అసమర్థ పాలనతో ప్రభుత్వంలోని పలు విభాగాలు గాడితప్పాయి. వాటిని సరిదిద్దుతున్నాము. పెండింగ్ బిల్లులను విడుదల చేస్తూ ముందుకు పోతున్నాము. మనది ప్రజా ప్రభుత్వం... ఆర్భాటాలు లేవు. 100 రోజుల్లో ఏంచేశామో ప్రజలకు చెప్పండి. నేతలు ఇంటింటికీ వెళ్లాలి. గ్రామ, వార్డు సచివాలయాతో పార్టీ ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకోవాలి. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్స్ ఇస్తాం. మనం చేసిన మంచి పనులు అందరికీ తెలియాలి. చారిత్రాత్మక విజయం అందించిన ప్రజలకు మనం సంక్షేమం, అభివృద్ధి అందించాలి' అని చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

---

- ఆవు నెయ్యి స్వచ్ఛతకు జాగ్రత్తలు తీసుకున్నాం
- తితిదే ఈవో శ్యామలరావు వెల్లడి
- లడ్డూ ప్రసాదానికి తగ్గని డిమాండ్
- సీఎం చంద్రబాబుతో తితిదే అధికారుల భేటీ
- ఆలయ సంప్రోక్షణపై సుదీర్ఘ సమీక్ష
- డిప్యూటీ సీఎంకూ పరిస్థితి వివరించిన ఈవో
- లడ్డూ కల్తీపై కేంద్రంలోనూ చర్చ
- జగన్ నివాసం వద్ద జనం ఆగ్రహం

# శుచిగా మహాప్రసాదం!



అమరావతి(చైతన్యరథం): తిరుమల తిరుపతి మహా ప్రసాదానికి వినియోగించే ఆవు నెయ్యి స్వచ్ఛతకు సం బంధించి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తితిదే ఈవో జె.శ్యామలరావు వెల్లడించారు. శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగంపై దేశవ్యాప్తంగా భక్తులు ఆందోళనకు గురవుతున్నవేళ తాజా పరిస్థితిని ఈవో వివరించారు. ప్రస్తుతం నందిని, ఆల్ఫా ఫుడ్స్ నుంచి రూ.475కు స్వచ్ఛమైన ఆవు నెయ్యి కొనుగోలు చేస్తు న్నట్టు చెప్పారు. ఈ రెండు సంస్థల నుంచి తీసుకుం టున్న ఆవు నెయ్యితోనే ప్రసాదాలు తయారు చేస్తున్నట్టు వెల్లడించారు. "నెయ్యిలో కల్తీ జరిగిందని తేలడంతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. నెయ్యి విషయం లో పొరపాట్లు జరగకుండా 18 మందితో సెన్సరీ ప్యానల్ ఏర్పాటు చేశాం. మూడు నెలల్లో సెన్సరీ ల్యాబ్ కూడా పెట్టాం. ఎన్‌డీడీబీ ల్యాబ్ సహకారంతోనే పరిక రాలు తీసుకువస్తున్నాం. స్వచ్ఛమైన ఆవునెయ్యి తీసుకు నే విధానంలో మార్పులు చేస్తున్నాం. దోషాల నివారణ కు ఆగస్టు 15నుంచి 17వరకు పవిత్ర ఉత్సవాలు నిర్వ హించాం. శ్రీవారి భక్తులు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దు" అని ఈవో జె.శ్యామలరావు విజ్ఞప్తి చేశారు.

ఇదిలావుంటే-తిరుమల శ్రీవారి లడ్డూకు భారీగా డిమాండ్ పెరిగినట్టే కనిపిస్తోంది. లడ్డూను చుట్టుము ట్టిన వివాదాలతో విక్రయాలు తగ్గుతాయని భావించిన ప్పటికీ,అలాంటిదేమీ కనిపించడం లేదు.వైసీపీ ప్రభుత్వ హయాంలో కల్తీ నెయ్యితో లడ్డూ ప్రసాదాలు తయార య్యాయన్న వివాదం చెలరేగినా..ఎన్డీయే సర్కారు వచ్చి న దగ్గర్నుంచీ తిరుమల క్షేత్రంపై తీసుకున్న ప్రక్షాళన చర్యలు ప్రజల్లో నమ్మకాన్ని పెంచింది. దీంతో లడ్డూ విక్రయాలపై నెయ్యి వివాదం ఎలాంటి ప్రభావం చూప లేదు. లడ్డూ తయారీలో తప్పిదాలు జరిగినా శ్రీవారి లడ్డూను పరమ పవిత్రంగా భావిస్తున్న భక్తులు 'మహా ప్రసాదాన్ని' భారీగానే కొనుగోలు చేస్తున్నారు. తాజా లెక్కల ప్రకారం ఈనెల 19న 3.59 లక్షల లడ్డూ ప్రసా దాన్ని శ్రీవారి భక్తులు స్వీకరిస్తే.. 20న 3.16 లక్షలు, 21న 3.66లక్షల లడ్డూ ప్రసాదాన్ని భక్తులు కొనుగోలు చేశారు.

మరోపక్క కల్తీనెయ్యి వివాదం దేశవ్యాప్తంగా దుమా రం రేపుతోంది. శ్రీవారికి కల్తీ నెయ్యిని సరఫరా చేసిన ఏఆర్ డెయిరీలో ఆదివారం ఫుడ్ సేఫ్టీ అధికారుల 13 గంటలపాటు నిరంతరంగా తనిఖీలు సాగించారు. అనంతరం పాల ఉత్పత్తుల శాంపిల్స్ అధికారులు సేక రించారు. మరోపక్క శ్రీవారికి జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా గుంటూరు జిల్లాలోని నంబూరు ఆల యంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దీక్ష ప్రారం భించారు. తిరుమల లడ్డూ అపవిత్రమైనందుకు క్షమిం చమని వేడుకుంటూ.. నంబూరు శ్రీ దశావతార వేంకటేశ్వరస్వామి ఆలయంలో 11రోజుల ప్రాయశ్చిత్త దీక్ష స్వీకరించారు. ఇంకొకపక్క తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడకంపై పూర్తిస్థాయి విచారణపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. టీటీడీ ఈవో శ్యామలరావు అందించిన ప్రాథమిక నివేదికను పరిశీలించిన ప్రభుత్వం.. ప్రపంచ స్థాయిలో ప్రాముఖ్య తను దృష్టిలో పెట్టుకుని కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడిన అంశం కావడంతో..కల్తీనిగ్గు తేల్చేందుకు సిట్ విచారణకు ఆదే శించింది. తొలుత తిరుమల లడ్డూ కల్తీపై తితిదే అధికారులతో సీఎం చంద్రబాబు ఆయన నివాసంలో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. టీటీడీ ఈవో శ్యామలరావు, డిప్యూటీ ఈవో వెంకయ్య చౌదరి, ఉన్నతాధికారులతో సమావేశమై ఈవో ఇచ్చిన ప్రాథమిక నివేదికపై చర్చించారు. శ్రీవారి ఆలయ సంప్రోక్షణపై తగు సూచనలను ఈవో శ్యామలరావు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందించినట్టు తెలు స్తోంది. అలాగే, అందుబాటులోవున్న మంత్రులతో ఇదే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చించారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్‌తో టీటీడీ ఈవో శ్యామలరావు భేటీ అయ్యారు. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిపై ఆరా తీసిన పవన్‌కల్యాణ్‌కు, గత పాలక మండలి హయాంలో ప్రసాదంలో కల్తీ జరిగినట్లు ఈవో వివరించారు. టీటీడీ తరపున సంప్రోక్షణ చర్యల వివరాలను పవన్‌కు ఈవో వివరించారు. భక్తుల మనోభావాలు, ధార్మిక అంశాల్లో రాజీ వద్దని సూచిం చిన పవన్.. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. అయితే, తిరుమల లడ్డూ వివాదాన్ని కేంద్రం సైతం సీరియస్‌గా తీసుకుంది. భక్తుల మనోభావాలతో ముడిపడిన అంశం కావడంతో, సాధ్యమైనంత త్వరగా దర్యాప్తు పూర్తిచేయాలని రాష్ట్రాన్ని కోరనున్నట్లు చెబుతున్నారు.

## జగన్ నివాసం వద్ద ఆగ్రహం

శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీపై తీవ్రఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ యువమోర్చా.. తాడేపల్లిలో వైఎస్ జగన్ నివాసం వద్ద ఆందోళనకు దిగారు. జగన్ నివాసాన్ని ముట్టడించి, జగన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ ఇంటి ముందు బైఠాయించి నిరసన తెలుపుతూ, జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## అర్హులందరికీ పారదర్శకంగా

# ప్రభుత్వ పథకాలు

- దీపావళి నుంచి మూడు గ్యాస్ సిలిండర్ల పథకం అమలు
- మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం
- రాబోయే ఐదేళ్లలో రాయచోటి నియోజకవర్గం రూపురేఖలు మారుస్తాం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



రాయచోటి(చైతన్యరథం): పేదల సంక్షేమమే కర్తవ్యంగా అర్హులందరికీ పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందజేస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం అన్నమయ్య జిల్లా రాయచోటి మండల పరిధిలోని సిబ్యాల గ్రామంలో "ఇది మంచి ప్రభుత్వం" ప్రజా దర్బార్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ...గతంలో ఎవరూ చేయని విధంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో వివిధ సంక్షేమ పథకాలు అమలుచేసి ప్రజల నుంచి ఇది మంచి ప్రభుత్వం అని ఒక గుర్తింపు తీసుకువచ్చామన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా వచ్చే దీపావళికి అర్హత ఉన్న ప్రతి ఇంటికి మూడు సిలిండర్లు ఇచ్చే కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు. మహిళల ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణానికి సంబంధించి త్వరలో విధి విధానాలు రూపొందించి అమలు చేస్తామన్నారు.

### ప్రజల సంక్షేమమే ధ్యేయం

గతంలో పెన్షన్లు కొందరికి మాత్రమే ఇచ్చే వాళ్ళని, నేడు కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు ఇస్తున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ మొత్తాన్ని పెంచి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం మేలు చేస్తోందన్నారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని వివిధ కేటగిరీలకు చెందిన పెన్షన్ల లబ్ధిదారుల ఇంటి వద్దనే ప్రతినెల ఒకటో తేదీన పంపిణీ చేస్తున్నామన్నారు.

పేదలు ఆకలితో పస్తులు ఉండ కూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించారన్నారు. కోట్లాది మంది రైతుల భూములు కాజేసేలా గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దుచేసి రైతుల్లో భయాందోళనలు తొలగించామన్నారు. డ్వాక్రా మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసేందుకు వారికి ఐదు నుంచి పది లక్షల రూపాయల వరకు రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడిన నూతన జిల్లాల్లో ప్రతి శాఖకు కొత్త భవనాలు నిర్మిస్తామన్నారు. ప్రస్తుతం కొత్త జిల్లాల్లో ప్రభుత్వ భవనాలు లేక ఉద్యోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి మండిపల్లి చెప్పారు.

### అర్హులందరికీ ఇళ్లు

రాయలసీమ ప్రాంతంలో వర్షపాతం తక్కువ పడడంతో నీటిమట్టం తగ్గిపోయి ఎన్ని బోర్లు వేసినా నీరు పడడం లేదన్నారు. దీంతో గ్రామాల్లో నీటి సమస్య తీర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇక నుంచి నీటి సమస్య రాకుండా రాబోయే ఐదు సంవత్సరాలలో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రాయచోటి నియోజకవర్గంలోని ఆరు మండలాలలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేస్తామన్నారు. గతంలో ఇల్లు మంజూరుకు సంబంధించి ఎన్నో అవకతవకలు జరిగాయని, వాటన్నింటినీ సరిదిద్దుతామన్నారు. ప్రతి గ్రామంలో ఎన్టీఆర్ కాలనీలు నిర్మిస్తామన్నారు. గత ప్రభుత్వంలో భూ ఆక్రమణలు జరిగాయని అవన్నీ తిరిగి స్వాధీనం చేసుకొని పేదలకు పంచుతామన్నారు.
ఈ ప్రాంతవాసులు చాలామంది జీవనోపాధి కోసం కువైట్,సౌదీలాంటి ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడ అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాంటి వారి సమస్యలు పరిష్కరించేందుకు ఈ ప్రాంతంలో వివిధ ఫ్యాక్టరీలు, పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.
రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన ప్రాంతాలలో సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. రాబోయే ఐదు సంవత్సరాలలో రాయచోటి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

---

## ప్రధాని నెత్తిన

# పచ్చి అబద్ధాలు!

(మొదటి పేజీ తరువాయి)

కొనుగోలుకు ముందే పలు నిబంధనలు విధించి.. అర్హులను మాత్రమే టెండర్లలో పాల్గొనేలా జాగ్రత్తలు తీసుకుంటుంది. ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా నోటిఫికేషన్ జారీ చేసి అతి తక్కువ ధరను కోట్ చేసిన టెండరుదారుడి వివరాలను తితిదే బోర్డులోని కొనుగోలు కమిటీ ముందు పెడుతుంది. ఆ కమిటీ ఆమోదం తరువాత.. పాలక మండలిలో చర్చించి కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తారు. ఇదీ జగన్ చెప్తున్న 'ప్రాసెస్'.

గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాలనే తామూ అనుసరించామన్న 'టెక్నికల్ ప్రాసెస్'ను జగన్ పదేపదే చెప్తున్నాడు. కానీ, రివర్స్ టెండరింగ్‌తో కమిషన్ల కాసులకు కక్కుర్తిపడి దేవదేవుడికి అపచారం చేసిన విషయాన్ని అంగీకరించడం లేదు. నిజానికి -ఏఆర్ ఫుడ్స్‌తో ముందే లాలూచీపడిన ఆనాటి తితిదే పెద్దలు. 2024 మార్చి 12న ఈ-టెండర్లు పిలిచారు. తూతూమంత్రంగా 'టెక్నికల్ ప్రాసెస్'ను ముగించి.. 2024 మే 8న టెండర్లు ఖరారు చేశారు. అతి తక్కువ ధరను కోట్ చేసిన ఏఆర్ ఫుడ్స్‌తోపాటు మరో రెండు మూడు కంపెనీలను ఖరారు చేస్తూ.. పాలక మండలి అనుమతులు మమ అనిపించారు. ఆ రీతిన మే 15న పర్చేజ్ ఆర్డర్ ఇవ్వడంతో.. జూన్ 15నుంచీ ఏఆర్ ఫుడ్స్‌నుంచి 'కేజీ ఆవునెయ్యి రూ.319.90'కి సరఫరా మొదలైంది. ఆ నెయ్యితోనే దేవదేవుని మహా ప్రసాదం తయారవుతోంది. ఇదంతా పక్కాగా రికార్డుల్లోవున్నా.. అసలు ఏఆర్ ఫుడ్స్‌నుంచి వచ్చిన నెయ్యిని లడ్డూ ప్రసాదానికే వాడలేదని జగన్ బుకాయించడం, ప్రధాని లేఖలో పొందుపర్చడం మహాదారుణం. పైగా ఏఆర్ ఫుడ్స్ నుంచి వచ్చిన నెయ్యిని రిజెక్ట్ చేసింది జగన్ సర్కారు కాదు, ఎన్డీయే ప్రభుత్వం. గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలోనే.. అధికారంలోకి వస్తే తన పాలన తిరుపతి ప్రక్షాళననుంచే మొదలవుతుందని చంద్రబాబు పదేపదే చెప్పిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. అలా ఎన్నికలలో గెలిచి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు.. తిరుమల ప్రక్షాళననుంచే పాలన ప్రారంభించారు. తిరుమల ఈవోగా శ్యామలరావును నియమించిన చంద్రబాబు.. పూర్తి ప్రక్షాళనా బాధ్యతలు అప్పగించారు. అప్పటికే లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదం నాణ్యతపట్ల లక్షలాది ఫిర్యాదులు రావడం, రెండు రోజులకే మహాప్రసాదం పాడైన వాసన వస్తుందంటే ఏదో అపరాధం జరుగుతుందంటూ భక్తులు గగ్గోలు పెట్టిన నేపథ్యంలో.. ప్రసాదాల నాణ్యతపై శ్యామలరావు దృష్టి పెట్టారు. ప్రధానంగా ఆవు నెయ్యి నాణ్యత నిగ్గుతేల్చడానికి నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు పరీక్షలకు పంపిన శ్యామలరావు.. ఫలితాలు చూసి ఖంగుతిన్నారు. జూలై 6న, 15న రెండేసి ట్యాంకులుగా వచ్చిన నెయ్యి శాంపిల్స్ తీసుకుని ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పంపితే.. జూలై 13, 16 తేదీల్లో వచ్చిన ఫలితాల్లో జంతుకొవ్వు వ్యవహారం బయటపడింది. వెంటనే ఏఆర్ ఫుడ్స్ నుంచి వచ్చిన కంటెయినర్లను సీజ్ చేశారు. అలా ఏఆర్ ఫుడ్స్ నెయ్యిని ఎన్డీయే సర్కారు రిజెక్ట్ చేస్తే.. అదేదో తన ప్రభుత్వహయాంలో జరిగిన ఘనతగా ప్రధానికి రాసిన లేఖలో జగన్ పొందుపర్చడం విస్మయకర విషయం. ప్రొక్యూర్‌మెంట్ టెండర్ దశనుంచి పర్చేజ్ ఆర్డర్ ఇచ్చేవరకూ జగన్ ప్రభుత్వ హయాంలో మహాపాపం జరిగితే.. అది ఎన్డీయే ప్రభుత్వ హయాంలో జరిగిన అంశంగా, తనకు సంబంధం లేనట్టు ప్రచారం చేసుకోవడం జగన్ చేసిన మరో ఘోరం. ఈ చర్య ప్రధాని మోదీని మోసం చేయడం కాదు, కలియుగ దైవం వెంకన్ననే మోసం చేయడం!!

ఇక -మునుపటి చంద్రబాబు హయాంలో కర్నాటక మిల్క్ ఫెడరేషన్ నుంచి నందిని నెయ్యినే కొనుగోలు చేయలేదన్న తప్పుడు సమాచారాన్ని ప్రధానికి లేఖలో జగన్ పొందుపర్చడం.. బరితెగింపే. ఒకపక్క కెఎంఎఫ్ చైర్మన్ భీమానాయక్ ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి -2013నుంచి 2018మధ్య తితిదేకు 4వేల టన్నుల ఆవునెయ్యిని పరమ పవిత్ర కార్యంగా సరఫరా చేశామని, 2019లోనూ 2వేల టన్నుల ఆవునెయ్యిని లాభాపేక్ష లేకుండా సేవా నిరతిగా సరఫరా చేశామని చెప్తుంటే.. దీనికి భిన్నంగా ప్రధానికి లేఖలో జగన్ పచ్చి అబద్ధాలు గుది గుచ్చాడు. వాస్తవానికి -కర్నాటకలో పాల ధరలు పెరిగిన నేపథ్యంలో తక్కువ ధరకు ఆవు నెయ్యిని సరఫరా చేయలేకపోతున్నట్టు కెఎంఎఫ్ సమాచారమివ్వడంతోనే -అప్పటి తితిదే పెద్దలు 'రివర్స్ టెండరింగ్'కు శ్రీకారం చుట్టారు. కేవలం రూ.320కి కేజీ ఆవునెయ్యి ఎలా లభిస్తుందన్న ఆలోచన లేకుండానే.. కమీషన్లకు కక్కుర్తిపడి తమిళనాడులోని ఏఆర్ సంస్థను రంగంలోకి దింపారు. ప్రస్తావించడానికి కూడా మనసొప్పని కలుషిత కొవ్వు పదార్థాల ఆయిల్‌ను కల్తీచేసి -ఆవునెయ్యిగా సరఫరా చేస్తే.. ఇంతకాలం స్వామివారి ప్రసాదాలను వాటితోనే తయారు చేశారు. ఈ విషయాలను ప్రధానికి రాసిన లేఖలో జగన్ దాచారనడానికి.. ఎన్‌డిడిబీ రిపోర్టును జత చేయకపోవడం నిదర్శనం. తాను రాసిన లేఖను తప్ప, ప్రధాని ఇంకేమీ చూడకుండా కళ్లు మూసుకుంటారన్న భ్రమ, అహంకారం కారణం కావొచ్చు.

నెయ్యి కొనుగోలుకు అనుమతులిచ్చిన తితిదే పాలకమండలి సచ్ఛీలత మానవమాత్రులు 'కొలవలేనంత' అన్నట్టుగా ప్రధానికి రాసిన లేఖలో జగన్ పొందుపర్చిన మరో విషయం అబద్ధాలకే అబద్ధం. కేబినెట్ కూర్పునకు కూడా వెచ్చించనంత సమయాన్ని, జాగ్రత్తను -పాలకమండలి కూర్పునకు వెచ్చించామని జగన్ పదేపదే చెప్తోన్న మాట ఇంకా అబద్ధం. జగన్ చెప్తోన్న అంతటి ఉదాత్తమైన పాలకమండలిని తడిమిచూస్తే.. దగాకోర్లు, చీటర్లు, కమీషన్లకు కక్కుర్తిపడేవాళ్లే కనిపిస్తారు. పవిత్రమైన తిరుపతి తిరుమలను తన సామాజిక వర్గానికి అడ్డాగా మార్చిన జగన్‌రెడ్డి.. ముఖ్యమంత్రి గద్దెనెక్కిన 20 రోజుల్లోనే బాబాయి వైవీ సుబ్బారెడ్డికి తితిదే చైర్మన్‌గిరీ కట్టబెట్టారు. నాలుగేళ్లపాటు రాజ్యమేలిన సుబ్బారెడ్డి.. తిరుమల ప్రతిష్టను ఎంత భ్రష్టుపట్టించాలో అంతా పట్టించాడు. విచ్చలవిడిగా అన్యమత ప్రచారాలు సాగినా పట్టించుకోలేదు. పైగా కొడుకు కళ్లలో కసితీరే ఆనందం చూడటానికి -హిందూ వ్యతిరేక విధానాలతో క్రిస్టియానిటీని ప్రోత్సహించాడు. దేవదేవుడు కొలువు దీరిన తిరుమల కొండకే.. పార్టీ రంగులు పూసే దుస్సాహసానికీ ఒడిగట్టాడు. నాలుగేళ్ల విశృంఖలత్వం తరువాత తితిదే ఛైర్మన్‌గిరీని మరో జగన్ బంధువు కరుణాకర్‌రెడ్డి ఆక్రమించాడు. 'టెన్ పర్సెంట్ కమీషనర్'గా పేరుబడిన కరుణాకర్‌రెడ్డి.. తితిదేను మరింత భ్రష్టుపట్టించాడు. కొండమీద జరిగే ఏ కార్యక్రమాన్నైనా 'టెన్ పర్సెంట్ కమీషన్'తో నిర్వహించిన కరుణాకర్‌రెడ్డి.. స్వామి సంపదను కోట్లు దోచేశారన్న అభియోగాలు లేకపోలేదు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేపట్టిన విజిలెన్స్ దర్యాప్తులో.. రూ.500 కోట్ల రూపాయల దోపిడీ సాగినట్టు ప్రాథమికంగా నిర్ధారించింది. వీరిద్దరూ అపర భక్తులని ప్రధానికి రాసిన లేఖలో జగన్ ప్రస్తావించడం.. ప్రధానిని మోసం చేయడమే. ఇక జగన్ చెప్పిన ఉత్తమోత్తమ పాలకమండలిలో శరత్‌చంద్రారెడ్డి, కేతన్‌దేశాయ్ ఉదాత్త అర్హతలను ప్రస్తావించాలి. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కీలక నిందితుడైన శరత్‌చంద్రారెడ్డి, మెడికల్ కౌన్సిల్ అధ్యక్షుడిగా పలు కుంభకోణాలకు పాల్పడి సీబీఐ అరెస్ట్‌తో జైలుకెళ్లిన కేతన్‌దేశాయ్‌లు పాలకమండలి ప్రాశస్త్యాన్ని నిలబెట్టేవాళ్లుగా ప్రధానికి పిక్చర్ ఇవ్వడం -జగన్ తెంపరితనానికి నిదర్శనం. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామిపట్ల మహాపరాధానికి పాల్పడమే కాదు, తన భ్రష్టత్వాన్ని సమర్థించుకోవడానికి ఎంతకైనా బరితెగిస్తున్న జగన్.. మనుషుల నుంచి, చట్టాలనుంచి తప్పించుకోవచ్చు. కాని -పైనుంచి తప్పొప్పుల జమాలెక్కలు చూసే భగవంతుడినుంచి తప్పించుకోవడం అసాధ్యం. వెంకన్నకు అపచారం చేసినోళ్లను వెంకన్నే కఠినంగా శిక్షిస్తాడని భక్తుల విశ్వాసం. ఆ శిక్షా సమయం ఎప్పుడు? అనే భక్తులు కళ్లలో వత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు!!

# పవిత్రమైన తిరుమల లడ్డూ కల్తీ దుర్మార్గం

- తప్పు చేసినవారిని జగన్ ఏ విధంగా సమర్థిస్తారు?
- ఇదే ఒక చర్చికి అపవిత్రం జరిగితే జగన్ ఊరుకుంటారా?
- జంతు అవశేషాల కల్తీ నేతితో చేసిన తిరుమల లడ్డూలు అయోధ్య రామ జన్మభూమికి పంపటం మహాపాపం
- హిందువుల మనోభావాలను దెబ్బతీసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టం
- క్యాబినెట్, అసెంబ్లీలో చర్చించి బాధ్యులపై కఠిన చర్యలు
- ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన అనంతరం మీడియాతో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్
- నంబూరు శ్రీ దశావతార వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో దీక్ష మాలధారణ



అమరావతి(చైతన్యరథం): తిరుమల పుణ్యక్షేత్రంలో శ్రీవారికి నైవేద్యంగా సమర్పించే మహాప్రసాదం లడ్డూను కల్తీ చేయడం దుర్మార్గమైన చర్య అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లడ్డూకు వినియోగించిన నెయ్యిలో బీఫ్ ఫ్యాట్, పంది కొవ్వు, చేప నూనె, సోయా, సన్ ఫ్లవర్ లాంటి ఇతర నూనెలు ఉన్నట్లు ఎన్‌డీడీబీ సీఏఎల్ఎఫ్ ల్యాబ్ నివేదిక ఇచ్చిందని వెల్లడించారు. వైసీపీ పాలన కాలంలో ఇలాంటి నేతిని వినియోగించి తయారు చేసిన లక్ష లడ్డూలను శతాబ్దాలుగా పోరాటంచేసి సాధించుకున్న రామ జన్మభూమి మందిరానికి తిరుమలతిరుపతి దేవస్థానంపంపి చాలా పెద్ద తప్పుచేసిందన్నారు. హిందువులు మహాప్రసాదంగా భావించే లడ్డూకు వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలపడం నీచమైన చర్య అని, ప్రతి హిందువు, ధర్మాన్ని పాటించే ప్రతీ వ్యక్తి దీన్ని ఖండించి పోరాడాల్సిన అవసరం ఉందని పునరుద్ఘాటించారు. దీనిపై కేబినెట్,అసెంబ్లీలో చర్చిచి దోషులను కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు.

వైసీపీ హయాంలో తిరుమల లడ్డూప్రసాదం తయారీలో ఉపయోగించిన నెయ్యి కల్తీ జరిగినట్టు నిర్ధారణ అయిన నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. గుంటూరు జిల్లాలోని నంబూరులో ఉన్న శ్రీ దశావతార వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం ఉదయం వెళ్లి దీక్ష తీసుకున్నారు. తిరుపతి లడ్డూ ప్రసాదం అపవిత్రమైన నేపథ్యంలో క్షమించమని వెంకటేశ్వరస్వామిని కోరుతూ ఆయన దీక్ష మాలధారణ తీసుకున్నారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ తిరుమలను హిందువులు పరమపవిత్ర పుణ్యక్షేత్రంగా భావిస్తారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సంస్కరణల పేరుతో చాలా మార్పులు చేసింది. స్వామివారి పూజా విధానాలను మార్చేశారు. శ్రీవాణి ట్రస్టు పేరుతో రూ.10వేలు వసూలు చేశారు. ఐదుగురు కుటుంబ సభ్యులు స్వామివారి దర్శనానికి వస్తే రూ.50 వేలు వసూలుచేసి బిల్లు మాత్రం రూ.500చొప్పునే ఇచ్చారు. నాతోపాటు చాలా మంది రాజకీయ నాయకులు దీనిపై ప్రస్తావించారు. తప్పు జరుగుతుందని వేలెత్తి చూపినా వైసీపీ నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదని డిప్యూటీ సీఎం పవన్ అన్నారు.

### ఏ మతమైనా మనోభావాలు దెబ్బతినకూడదు

వైసీపీ ప్రభుత్వహయాంలో తిరుమలలో చాలా అవకతవకలు జరిగాయి.ప్రసాదాల నాణ్యత తగ్గిపోయింది. శ్రీవారి లడ్డూను హిందువులు మహా ప్రసాదంగా భావిస్తారు.ఆ మహాప్రసాదాన్ని కూడా కల్తీ చేశారు. అయితే ఈ స్థాయిలో కల్తీ జరుగుతోందని ఊహించలేదు. దారుణం ఏమిటంటే శతాబ్దాలుగా పోరాటం చేసి సాధించుకున్న రామ జన్మభూమి మందిరానికి ఇదే నెయ్యితో చేసిన లక్ష లడ్డూలు పంపించారు. ఇప్పుడు రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో కూడా ప్రసాదాల నాణ్యతపై చర్చ జరుగుతోంది.

గత ప్రభుత్వ పాలన కాలంలో 219 ఆలయాలను అపవిత్రం చేశారు. రథాలు తగలబెట్టారు. రామ తీర్థం ఆలయంలో రాముడి విగ్రహానికి శిరచ్ఛేదం చేస్తే ఆనాడు పోరాడాం. ఏ మతమైనా మనోభావాలు దెబ్బ తినకూడదు. రామతీర్థం ఘటనపై అందరూ బయటకు రావాలని కోరితే చిలకలూరిపేట నుంచి ముస్లిం సోదరులు బయటకు వచ్చి మద్దతు ఇచ్చారు. రాజకీయ లబ్ధి కోసం చేస్తున్నామని వైసీపీ మాట్లాడుతోంది. రామ తీర్థం దేవుడి విగ్రహం ధ్వంసం చేసినప్పుడే రోడ్డు మీదకు వచ్చేవాడిని. ఆ రోజు రాజకీయం చేయలేదు. అన్ని మతాలను సమానంగా చూస్తాను కనుకే సంయమనం పాటించాను. రామతీర్థం దోషులను పట్టుకొని శిక్షించాలని కోరితే పట్టుకోలేకపోయారని పవన్ తప్పుబట్టారు.

### వైసీపీ తప్పులకు ఫుల్ స్టాప్ పెట్టాలి

దాడులు జరుగుతున్నప్పుడు చూస్తూ కూర్చుకోదం కూడా తప్పే. ధర్మాన్ని పాడు చేసే హక్కు ఎవరికీ లేదు. పగ,ప్రతీకారం తీర్చుకునే ప్రభుత్వంకాదు మాది. వైసీపీకి తప్పులుచేయడం అలవాటయింది. దీనికి ఫుల్‌స్టాప్ పెట్టాలి. నెయ్యి కల్తీకి గత టీటీడీ బోర్డు బాధ్యత వహించాలి. ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, ఇతర పాలకవర్గంపై విచారణ జరగాలి, తప్పు ఎవరు చేశారో బయటకు తీయాలి.మాది కక్షసాధింపు ప్రభుత్వంకాదు. అలాగే ఎవరైనా తప్పులు చేస్తే ఉపేక్షించే ప్రభుత్వం కూడా కాదు. టీటీడీ బోర్డు ఉన్నది ధర్మాన్ని పరిరక్షించడానికి మాత్రమే...దర్శనం టిక్కెట్లు మీవారికి ఇచ్చుకోవడానికో, మీ ఇష్టానికి కాంట్రాక్టులు ఇవ్వడానికో కాదు. టీటీడీ బోర్డులో తప్పులుచేస్తూ, శ్రీవారిని అపవిత్రం చేస్తాం.. మీరు మాట్లాడకూడదు అంటే కుదరదు. కచ్చితంగా కోపాలు వస్తాయి.మేము మాట్లాడతాం. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను ప్రశ్నిస్తాం, ఖండిస్తాం, చర్యలు తీసుకుంటామని పవన్‌కళ్యాణ్ స్పష్టం చేశారు.

### జగన్ ఎలా సమర్థిస్తారు?

తప్పులు చేసినవారిపై చర్యలు తీసుకోకుండా జగన్ వారిని ఎలా సమర్థిస్తారు? కోట్ల మంది హిందువులు స్వీకరించే ప్రసాదాన్ని అపవిత్రం చేస్తారా? దోషులకు శిక్ష పడాల్సిందే. చర్చి, మసీదులో ఇలా జరిగితే దేశం అల్లకల్లోలం అయిపోయేది. ప్రపంచం అంతా మాట్లాడేది. గ్లోబల్ న్యూస్ అయ్యేది. అదే హిందువులకు జరిగితే మాట్లాడకూడదా? సెక్యూలర్ వ్యవస్థకు విఘాతం కలుగుతుందా? హిందువులకు మనోభావాలు ఉండవా? ఏ మతంపై దాడి జరిగినా ఇలాగే స్పందిస్తాం. గత ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని సూటిగా అడుగుతున్నాను. తిరుమలలో జరిగిన విధంగా ఒక చర్చికి అపవిత్రం జరిగితే ఊరుకుంటావా? ఒక మసీదుకు జరిగితే ఊరుకుంటావా? మరి తిరుమలలో అపవిత్రం జరిగితే ఎందుకు మాట్లాడకూడదు అంటున్నారు? మేము మాట్లాడతాం, మేము హిందూ, ముస్లిం, క్రిస్టియన్ ఏ మతం మీద దాడి జరిగినా మాట్లాడతాం, సనాతన ధర్మంపై దాడి జరిగినా మాట్లాడుతాం. తిరుమల ఘటనలో దోషులకు కఠిన శిక్ష పడాల్సిందే అని పవన్ కళ్యాణ్ అన్నారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేస్తున్నాను. గత ప్రభుత్వ హయంలో టీటీడీలో జరిగిన అవకతవకలు,అక్రమాలు, అపచారాలపై విచారణ జరగాలి, దోషులను శిక్షించాలి. మీడియా ప్రతినిధులు సీబీఐకి ఈ కేసు తీసుకువెళ్తారా అని అడిగారు, క్యాబినెట్‌లో చర్చ జరిగే విధంగా చూసి, దీనిపై నిర్ణయం తీసుకోవలసిందిగా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా మేము సహకరిస్తాం. తిరుమలలో జరిగిన ఘటన ఇంకెప్పుడు భవిష్యత్తులో జరగకుండా చూసేలా మా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పవన్ స్పష్టం చేశారు.

### కల్తీ జరుగుతుంటే హిందూ అధికారులు ఎందుకు మాట్లాడలేదు?

తిరుమలలో ప్రతిరోజు దాదాపు 15వేలకిలోల నెయ్యి వినియోగిస్తారు. ఒక కిలో నెయ్యి తయారీకి దాదాపు రూ.వెయ్యి ఖర్చవుతుంది.అలాంటిది రూ.360కే వస్తుందని ఒక మధ్యవర్తి చెబితే క్వాలిటీ చెక్ చేయకుండా ఎలా తీసుకుంటారు? స్వామివారి ప్రసాదంలో కల్తీ జరుగుతుంటే హిందూ అధికారులు, బోర్డు సభ్యులు ఎందుకు మాట్లాడలేదు. వైసీపీ అంటే భయమా? లేక సుబ్బారెడ్డి అంటే భయమా? ఉద్యోగులు మౌనంగా ఉండి మహాపరాధం చేశారు. ఈ అపరాధంతో నాకు సంబంధం లేకపోయినా ప్రాయశ్చిత్త దీక్ష తీసుకుంటున్నానని ఉప ముఖ్యమంత్రి పవన్ చెప్పారు.

### పవన్ కల్యాణ్‌కి పూర్ణకుంభ స్వాగతం

ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టేందుకు నంబూరులోని శ్రీ దశావతార వేంకటేశ్వరస్వామి వారి దేవాలయానికి వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కి ఆలయ అధికారులు,అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతంపలికారు. స్వామి, అమ్మవార్లకు పవన్‌కళ్యాణ్ పట్టు వస్త్రాలు సమర్పించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పవన్‌కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. ఈ దీక్ష 11 రోజులపాటు కొనసాగ నుంది. దీక్ష ముగిసిన అనంతరం తిరుమల శ్రీ వేంక టేశ్వరస్వామి వారిని పవన్‌కళ్యాణ్ దర్శించుకుంటారు. అంతకు ముందు పవన్‌కళ్యాణ్‌కి పార్టీ నాయకులు పూలవర్షంతో స్వాగతం పలికారు. శాస్త్రీయ నృత్యరీతులతో పలికిన ఈస్వాగతం అందరినీ ఆకట్టుకుంది. ఈకార్యక్రమంలో శాసనమండలిసభ్యుడు పిడుగు హరిప్రసాద్, జనసేననేతలు కళ్యాణం శివశ్రీనివాస్,అమ్మిశెట్టి వాసు, బండ్రెడ్డి రామకృష్ణ, తదితరపార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ధార్మిక అంశాల్లో రాజీవద్దు

- టీటీడీ ఈవోకు డిప్యూటీ సీఎం పవన్ స్పష్టీకరణ
- పవిత్ర ప్రసాదం లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై చర్చ

అమరావతి(చైతన్యరథం): ధార్మిక అంశాల్లో రాజీ వద్దని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కార్యనిర్వహణాధికారి జె.శ్యామల రావు కు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. టీటీడీ ఈవో శ్యామలరావు ఆదివారం మధ్యాహ్నం ఉప ముఖ్యమంత్రితో సమావేశమై తిరుమల శ్రీవారి ప్రసాదాలు అందించారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పవిత్ర ప్రసాదం లడ్డూ తయారీలో వినియోగించిన నెయ్యి కల్తీతో కూడినదనీ, అందులో జంతు అవశేషాలు ఉన్నాయనే అంశంపై ఈవో పలు వివరాలను ఉప ముఖ్యమంత్రికి తెలిపారు. గత పాలక మండలి హయాంలో నెయ్యి సరఫరాదారును ఎంపిక చేసిన ప్రక్రియను, ల్యాబ్ పరీక్షల్లో వెల్లడైన ఫలితాలను తెలిపారు. ప్రస్తుతం లడ్డూ ప్రసాదం, శ్రీవారి ప్రసాదాల తయారీలో నిబంధనలను, శాస్త్రోక్తమైన నియమాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని ఈవో తెలియచేశారు. టీటీడీ సంప్రోక్షణ కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పలు సూచనలు చేశారు. భక్తుల మనో భావాలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు.



# 'లడ్డూ' పాపం హిందూ ద్రోహి జగన్‌దే

- తప్పు కప్పిపుచ్చుకునేందుకే ప్రధానికి లేఖ
- ప్రపంచంలోనే కరడుగట్టిన హిందూ ద్వేషి జగన్
- జంతుకొవ్వు కలిసిన కల్తీ నెయ్యితో శ్రీవారి ప్రసాదం తయారీ మహాపచారం
- తిరుమలలో ఏఆర్ ఫుడ్స్ నుంచి నెయ్యి కొనుగోలు మొదలైంది జగన్ హయాంలోనే
- చంద్రబాబు సీఎం అయిన తరువాతే దిద్దుబాటు చర్యలు
- టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పట్టాభి స్పష్టీకరణ



అమరావతి(చైతన్యరథం):ప్రపంచంలోనే అత్యంత కరుడుగట్టిన హిందూ ద్రోహి, హిందూ ద్వేషి జగన్ రెడ్డి...తిరుమల ప్రతిష్టను సీఎం చంద్రబాబు దిగజారుస్తున్నారంటూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాయటం చేసిన తప్పులుకప్పిపుచ్చుకునేందుకేనని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి విమర్శించారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేయ దం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువుల మనోభావాల్ని జగన్ దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం మీడియాతో పట్టాభి మాట్లాడుతూ స్వామి వారి ప్రసాదంలో జగన్ చేసిన పాపం గురించి తెలుసుకున్నాక ప్రతిరోజు, ప్రతి హిందువు వెంకటేశ్వరుడి ముందు నిలబడి క్షమించమని కోరాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఎంతో భక్తి భావంతో నైవేద్యంగా సమర్పించే ప్రసాదాన్ని జగన్ ప్రభుత్వం అపవిత్రం చేసింది. భక్తులకు అందించిన ప్రసాదంలో జంతు కొవ్వు ఉండడం క్షమించరాని నేరం. రాష్ట్రాన్ని పాలించిన ఒక దుర్మార్గుడు చేసిన పాపం ఇది. జంతు పదార్థాలతో మిళితమై, కలుషితమైన నెయ్యితో శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రసాదమైన లడ్డూలను తయారు చేయుడం మహా అపచారం. జగన్ అనే హిందూ ద్రోహి, ద్వేషిని ప్రపంచం క్షమించదు. తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రమైందనే వార్తను జీవిత కాలంలో వినాల్సి వస్తుందని కలలో కూడా ఎవరూ ఊహించి ఉండరు. తిరుపతి ప్రసాదంలో జంతు కొవ్వు కలిసిందన్న విషయం ఎన్‌డీడీబీ ల్యాబ్ రిపోర్టు ద్వారా తేటతెల్లమైంది. ఇంత స్పష్టంగా ల్యాబ్ రిపోర్టు ఆధారంగా తప్పు బయటపడినా.. మీడియా ముందుకొచ్చి జగన్ బుకాయిస్తూ చాలా తేలిగ్గా మాట్లాడుతున్నాడు. ఇంత ఘోరమైన తప్పు చేసి సిగ్గు లేకుండా బుకాయించడం జగన్‌కే చెల్లింది. ఈ విషయంలో మీడియాకు వివరణ ఇచ్చే సమయంలో జగన్ ముఖంలో బాధ అనేది ఏ కోశాన లేదు. అయ్యో ఇంత పాపం జరిగిందా అనే పాశ్చాత్తాపం కనబడలేదు. ఇంతటి పాపం కలలో కూడా ఎవరూ చేసి ఉండరని పట్టాభి దుయ్యబట్టారు.

### జగన్ చెప్పేవన్నీ అబద్ధాలే

తిరుపతి ప్రసాదం లడ్డూ విషయంలో జగన్ అన్నీ అబద్ధాలు వండి వార్చాడు. చంద్రబాబు అబద్ధాలు చెప్పారని జగన్ అంటున్నాడు. మరోపక్క ఆ భగవంతుడే నాతో నిజం మాట్లాడించాడని సీఎం చంద్రబాబు చెప్పారు. ఏఆర్ ఫుడ్స్ నుంచి నేతి కొనుగోలు ప్రారంభం అయింది జగన్ హయాం నుంచే. నెయ్యి కొనుగోలుకు సంబంధించిన టెండరు 2024, మార్చి 12 న పిలిస్తే.. మే 8న ఏఆర్ ఫుడ్స్‌కు అనుకూలంగా టెండర్ ఖరారు చేసి మే 15 నెయ్యి కొనుగోలుకు పర్చేజ్ ఆర్డర్ కూడా విడుదల చేశారు.

ఆ మరుసటి రోజు నుండే ఏఆర్ ఫుడ్స్ టీటీడీకి కలుషిత నెయ్యి సరఫరా ప్రారంభించింది. జూన్ 12న ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, టీటీడీకి నూతన ఈవో శ్యామల రావు నియామకం జరిగింది. ఆ తరువాత ప్రసాదాల నాణ్యత విషయమై భక్తుల నుండి పదే పదే వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని ప్రసాదాలు, అన్నదానాలకు సంబంధించి వాడుతున్న ముడి సరుకుల నాణ్యతను పరీక్షించమని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆయన ఆదేశానుసారం ఏఆర్ ఫుడ్స్ సరఫరా చేస్తున్న నెయ్యిపై కూడా దృష్టి సారించి దానిలో నాణ్యతా లోపం ఉందని ప్రాథమికంగా గుర్తించి, మరిన్ని సాంకేతికపరమైన పరీక్షల కోసం గుజరాత్‌లోని ఎన్డీడీబీ ల్యాబ్ కు నెయ్యి శాంపిళ్లను పంపించారని పట్టాభి తెలిపారు.

### నెయ్యి కొనుగోలు ప్రారంభయింది ఎవరి హయాంలో?

జులై 12వ తేదీన మాత్రమే ఏఆర్ ఫుడ్స్ నుంచి నెయ్యి వచ్చిందని జగన్ అంటున్నారు. ఆ తర్వాత నెయ్యి రాలేదంటున్నారు. ఇందులో అర్థంలేదు. జులై నెలలో చంద్రబాబే ముఖ్యమంత్రి అనే రీతిగా మాట్లాడుతున్నాడు. మా ప్రభుత్వం లేదని జగన్ బొంకుతున్నాడు. తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. రాష్ట్ర ప్రజలకు నిజాలు తెలవాలి. 204, మార్చి 12న నెయ్యి కొనుగోలుకు టెండర్ పిలిచినప్పుడు సీఎం ఎవరో జగన్ చెప్పాలి. మే 15 నుంచి ఏఆర్ ఫుడ్స్ నుంచి నెయ్యి కొనుగోలు ప్రారంభమైంది. అప్పుడు సీఎం ఎవరో చెప్పాలి. గత 5 సంవత్సరాల కాలంలో లడ్డూ ప్రసాదాలపై, అన్న ప్రసాదం నాణ్యతపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. స్వామివారి భక్తులు ధర్నాలు కూడా చేశారు. అయినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కర్నాటక మిల్క్ ఫెడరేషన్ 2013 నుంచి 2018 మధ్య టీటీడీకి, దాదాపుగా 4 వేల టన్నుల నందినీ నెయ్యి సరఫరా చేసిందని ఆ సంస్థ ఛైర్మన్ బీమా నాయక్ చెప్పారు. 2019లో 2 వేల టన్నుల నెయ్యి సరఫరా చేసింది. జగన్ అధికారంలోని రాగానే ఆ సంస్థ నుంచి నెయ్యి కొనుగోళ్లు నిలిపివేశారు. అక్కడి నుంచే నెయ్యిలో కల్తీకి బీజం పడింది. ఐదేళ్ల జగన్ పాలనలో ఎన్నో ఆలయాలు కూల్చేశారు. రథాలు తగులబెట్టారు.. విగ్రహాలు పగలగొట్టారు. జగన్ రెడ్డి హిందూ ద్రోహి. రామతీర్థంలో రాములవారి విగ్రహాన్ని ధ్వంసం చేస్తే తాడేపల్లి కొంపలో కూర్చుని పైశాచిక ఆనందం పొందారని పట్టాభి అన్నారు.

### వాస్తవం తెలిసీ బుకాయింపు

హిందూ ద్వేషి జగన్‌రెడ్డి.. ప్రధానికి లేఖ రాయడం విడ్డూరం. చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికే ప్రధానికి లేఖ రాశావు. చంద్రబాబు గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు. టీడీపీ హయాంలో వేల టన్నుల స్వచ్ఛమైన నందిని నెయ్యి సరఫరా చేసినట్లు కర్నాటక మిల్క్ ఫెడరేషన్ ఛైర్మన్ మీడియా ముందుకు వచ్చి చెప్పారు. ఆయన ప్రెస్ మీట్ ని కూడా యూట్యూబ్‌లో ఇప్పుడు కూడా చూడొచ్చు.

జగన్ చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలు. ప్రధాని మోదీకి రాసిన లేఖలో తప్పుడు సమాచారం ఇచ్చారు. ఏది రాస్తే అది గొర్రెల్లా నమ్మేస్తారని జగన్ అనుకుంటున్నాడు. ఏదైనా రిపోర్టు గురించి ప్రస్తావన తెచ్చినప్పుడు మనం ఆ రిపోర్టులో ఎన్‌క్లోజ్డ్ మెన్షన్ రిపోర్టు కాపీ అని పెట్టి ఆ రిపోర్టును జతచేస్తాం. జంతు కొవ్వు లేదని నిర్ధారించారని చెబుతున్నారు. అలాంటప్పుడు ఆ కాపీని ఎందుకు జతచేయలేదు? రిపోర్టులో తాటికాయంత అక్షరాలతో ఉంది. లాడ్(పంది కొవ్వు), బీఫ్ టాలో(గొడ్డు కొవ్వు), ఫిష్ ఆయిల్ ఉన్నట్లు స్పష్టంగా ఉంది. ఈ విషయాలు జగన్‌కు తెలుసు. వాస్తవాలు తెలిసీ బుకాయిస్తున్నాడు. తాను చేసిన పాపమేంటో జగన్‌కు తెలుసు. అందుకనే ప్రధానికి రాసిన లేఖకు రిపోర్టు కాపీని జతపరచలేకపోయాడని పట్టాభి ధ్వజమెత్తారు.

### జగన్ పాపం అందరికీ అర్థమయింది

ఈ రిపోర్టులో కొన్ని స్పెషల్ కండిషన్స్ అంటూ ప్రస్తావించారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో వాళ్ల పరిశీలనలో తేలిన అంశాలు వాస్తవం కాకపోయే అవకాశం ఉంది. ఈ రిపోర్టు పబ్లిక్ డొమైన్‌లోనే ఉంది. ఇంగితజ్ఞానంతో ఆలోచించాలి. ఆవులో కొన్ని లోపాలుంటే రిపోర్టులో తేడా ఉండొచ్చని రాశారు. ఒక్క ఆవు వేల టన్నుల నెయ్యి తయారు చేసే పాలు ఇచ్చేస్తుందా అనే విషయం ఆలోచించాలి. అలాంటా సూపర్ కౌస్ ఎక్కడా లేవు. జగన్ ఆలోచనా ధోరణి సరిగా లేనట్లు స్పష్టమౌతోంది. ప్రెస్ మీట్ లో రిపోర్టు చదవడానికే కిందా మీద పడ్డాడు. నీకున్న చదువు పరిజ్ఞానమేంటో ప్రెస్‌మీట్ లో జనమంతా చూశారు. ప్రజల్ని ఏదో ఒక విధంగా తప్పుదోవ పట్టించాలనేదే జగన్ ఉద్దేశం. పచ్చి అబద్ధాలు వండి వార్చుతున్నారు. జగన్ చేసిన పాపం నేడు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక హిందువుకి స్పష్టంగా అర్థమైంది. దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున జగన్ దిష్టి బొమ్మలు తగలేస్తున్నారు. అవసరమైతే సీబీఐ ఎంక్వైరీ వేయడానికి కూడా కూటమి ప్రభుత్వం వెనకాడదు. దీని వెనుక ఉన్న పాపాత్ములందరికీ కఠినాతికఠినమైన శిక్ష పడాలని ప్రపంచంలోని హిందువులతోపాటు అన్ని మతాలవారు కోరుకుంటున్నారని పట్టాభి స్పష్టం చేశారు.

---

లడ్డు కల్తీ వ్యవహారంలో

## సిట్ విచారణను స్వాగతిస్తున్నాను

- శ్రీవాణి లెక్కలు కూడా తేల్చాలి
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



అమరావతి(చైతన్యరథం): తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించడంపై ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో సిట్ ఏర్పాటును స్వాగతిస్తున్నానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ నిర్ణయంతో తిరుమలలో చోటు చేసుకున్న ఈ అపవిత్రత ఎవరివల్ల, ఎందుకు జరిగిందనే విషయం బయటకు వస్తుందన్నారు. ఇదే సందర్భంలో తిరుమలలో శ్రీవాణి టిక్కెట్ల వ్యవహారంపైనా విచారణ చేపట్టాలని కోరుతున్నాను. శ్రీవాణికి సంబంధించిన లెక్కలపై నిపుణులతో విచారణ చేయించాలి. భగవంతుడికి చేసే సేవల విషయంలోనే కాదు, ఆర్థికపరమైన అంశాలలోనూ గత పాలకులు ఏ విధమైన పెడపోకడలు అవలంభించారో ప్రజలకు తెలియాల్సిన సమయం ఇదని పవన్ అన్నారు.

## మహాపరాధానికి శిక్ష తప్పదు

- వైసీపీకి రాష్ట్రంలో ఉండే అర్హత లేదు
- ప్రసాదం కల్తీపై మాజీమంత్రి సుజాత ధ్వజం



అమరావతి(చైతన్యరథం): తిరుమల తిరుపతి మహా ప్రసాదాన్ని కల్తీచేసి మహాపరాధానికి పాల్ప డిన వైసీపీ దుష్టులు ఎంతటివారైనా శిక్షలనుంచి తప్పించుకోలేరని మాజీ మంత్రి పీతల సుజాత హెచ్చరించారు. వైసీపీ హయాంలో దేవుడిని దర్శించుకోవడం కూడా గగనమయ్యేదని, చివర కు వేంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని సైతం కల్తీ చేసి మహాపచారం చేశారని దుమ్మెత్తిపోశారు. వైసీపీ ప్రభుత్వం తితదేలో అంతులేని అవినీతికి పాల్ప డిందంటూనే, కాసుల కోసం దేవుని ప్రసాదాన్ని కల్తీ చేస్తారా? అని నిలదీశారు. వెంకన్న భక్తుల మనోభావాలను దెబ్బతీసి మహాపరాధం చేసిందే కాకుండా, ప్రెస్‌మీట్లు పెట్టి ఎదురుదాడి చేయడా న్ని తప్పుబట్టారు. వైవీ సుబ్బారెడ్డికి దమ్ము, ధైర్యం లేదు. అతను చేసిన సవాల్‌ను మంత్రి లోకేష్ స్వీకరించి ప్రమాణానికి రమ్మంటే, సుబ్బా రెడ్డి కోర్టుకెళ్లి స్టే ఆర్డర్ ఎందుకు తెచ్చుకున్నారు? ఎందుకు పారిపోయారు? తప్పు చేయలేదు, ప్రమాణం చేస్తామని చెప్పినవారు కోర్టు మెట్టెందు కెక్కారు? అని పీతల సుజాత నిలదీశారు. 'వైసీపీ హయాంలో అత్యంత దారుణాలు జరిగాయి. వాటిని ఒక్కొక్కటీగా చంద్రబాబు బయటికి తీస్తున్నారు. దీంతో వైసీపీకి వెన్నులో వణుకు పుడుతోంది' అని వ్యాఖ్యానించారు. 'మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఏం మాట్లాడుతారో ఆయనకే తెలీదు,ఇక ప్రజలకు ఏమర్థమౌతుంది? గత ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానాన్ని అపవిత్రం చేశారు. దాన్ని ప్రక్షాళన చేసే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోంది. వైసీపీ హయాంలో చేసిన అన్యాయాలు అన్నీ ఇన్నీ కావు. దేవుడితో కూడా ఆట్లాడుకుంటారా? దేవుడి ప్రసాదంలో కూడా ఇంతటి అవినీతికి పాల్పడతారా? తిరుమల ప్రసాదం లడ్డూల్లో కల్తీ నెయ్యి వాడతారా? ఇది భక్తులను అవమానించ డమేనని అన్నారు. వైసీపీ పాపాలు ఒక్కొక్కటీగా బయట పడుతున్నాయని, దేవుడికి మోసం చేసి నందుకే.. 151 సీట్లల్లో మధ్యలోని 5 తీసేసి 11 మిగిల్చాడని ఎద్దేవా చేశారు. వెంకన్నకు జరిగిన అపరాధానికి ప్రాయశ్చిత్తంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దీక్ష బూనారు. ఖచ్చితంగా ఆలయ శుద్ధి జరుగుతుంది. టీటీడీ ప్రసాదమంటే భక్తులకు నమ్మకం. ఆ నమ్మకాన్ని తిరిగి చంద్ర బాబు సారథ్యంలోని ఎన్డీయే సర్కారు నిలబెడు తుందని సుజాత ధీమా వ్యక్తం చేశారు. హిందు వుల మనోభావాలు దెబ్బతీసిన జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ పరివారానికి రాష్ట్రంలో ఉండే అర్హత లేదు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు మంత్రులు తితిదే దర్శన టికెట్లు అమ్ముకున్న నీచులు. కూటమి ప్రభుత్వం ఆదేశాలతో తితిదే దేవస్థానంతో కలిసి సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని, భక్తులకు క్వాలిటీ ప్రసాదం అందచేస్తామన్నారు. చట్టం ఎవ్వరికీ చుట్టం కాదంటూనే, తప్పుచేసిన వారు ఎవ్వరైనా, ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని మాజీమంత్రి పీతల సుజాత హెచ్చరించారు.

# అక్కుపక్షి జగన్ రెడ్డి.. నీచపు అబద్ధాలు!

## తప్పులను కప్పిపుచ్చుకునేందుకు మీడియా ముందు తంటాలు

అక్కుపక్షిలా శవాలకోసం ఎదురుచూస్తూ.. శవ రాజకీయాలు చేయడం.. కాలకేయుల్లాంటి కామాంధులను రాష్ట్ర నలుమూలల పెట్టుకుని దోచుకోవడం, దాచుకోవడం తప్ప.. గత ఐదేళ్లు జగన్‌రెడ్డి చేసిందేమీ లేదు. చెమ్మచెక్కలాడే చెడ్డీగ్యాంగ్‌కు ఒక్కఛాన్స్ అంటే జనం అధికారం ఇచ్చారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకుండా.. రాకాసుల్లా రాష్ట్రంపై, రాష్ట్ర ప్రజలపై పడి దోచుకోవడమే కాకుండా.. చివరకు దేవాలయాలు.. ఆ కలియుగ దైవమైన వెంకన్న సన్నిధిలో కూడా చేయరాని పాపాలు చేశారు. కమీషన్ల కోసం కక్కుర్తి పడి.. పరమ పవిత్రమైన శ్రీవారి లడ్డూను అపవిత్రం చేశారు. ఆవు నెయ్యి పేరుతో గొడ్డుమాంసం, చేప మాంసం, పందిమాంసం నుండి వచ్చే కొవ్వుతో కల్తీ అయిన నెయ్యి కొనుగోలు చేసి శ్రీవారి లడ్డూ తయారీలో వాడారు. ఇంతకంటే ఘోరం మరొకటి ఉంటుందా?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు స్వామివారి ప్రసాదం ఏ విధంగా ఉంది? ఇప్పుడు ఏ విధంగా ఉందో భక్తులను అడిగితే చెబుతారు? వైసీపీ హయాంలో వాడిన నెయ్యి, జీడిపప్పు, బాదంపప్పు, తదితర పదార్థాలు అన్నీ నాసిరకమే. వాటిని ఉపయోగించడం వల్ల లడ్డూల్లో నాణ్యత పడిపోయిందన్న విషయం ప్రపంచం మొత్తానికి తెలుసు. ఎన్నోసార్లు ఈ అంశంపై నిలదీసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. స్వామి వారిపై భక్తితో రాయితీ మీద తక్కువ రేటుకు సరఫరా చేస్తున్న కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్)కో ఆపరేటివ్ డెయిరీ తయారు చేసే నందినీ బ్రాండ్ ఆవునెయ్యిని కాదని.. కమీషన్లు రావనే ఉద్దేశంతో ఆ సంస్థను పక్కనపెట్టి..కక్కుర్తితో ఇతర సంస్థలతో ఒప్పందం చేసుకున్నారు. మాజీ ఈవో ధర్మారెడ్డికి కావాల్సిన వారి కోసం నిబంధనలకు విరుద్ధంగా వాళ్ళకి నచ్చిన ట్రేడర్లకు టెండర్‌ను అప్పజెప్పారు. స్వచ్ఛమైన కేజీ ఆవు నెయ్యి రూ.400 నుంచి రూ.1000 వరకు ఉంటుంది. కానీ రూ.320కే సరఫరా చేస్తానంటూ కొన్ని సంస్థలు ముందుకు వచ్చాయి. ఇంత తక్కువ ధరకు ఇవ్వటం ఎలా సాధ్యం అని కనీసం విచారణ జరపకుండా ఆ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ సంస్థలు నాసిరకపు నెయ్యిని రూ.320కే సరఫరా చేశాయనేది వాస్తవం.

### నాసిరకం నెయ్యి అని నిర్ధారించిన ల్యాబ్

నేతి నాణ్యతను పరిశీలించేందుకు తేది 08.07.2024న NDDB CALF (నేషనల్ డైరీ డవలప్‌మెంట్ బోర్డు) ల్యాబ్‌కు పంపించగా.. అక్కడ నేతి శ్యాంపిల్స్‌ను పరిశీలించి 16.07.2024న నివేదిక ఇచ్చారు. NDDB CALF ల్యాబ్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యతను పరిశీలిస్తుంది. ISO 17025 గుర్తింపు పొందింది. డెయిరీ ఉత్పత్తులను పరిశీలించడంలో అపార అనుభవం ఉంది. ప్రభుత్వంతోపాటు అనేక సంస్థలు ఈ ల్యాబ్ సేవలను ఉపయోగించుకుంటున్నాయి. జాతీయంగా, అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు కలిగిన ఈ సంస్థ నివేదికలను ఆధారంగా చేసుకుని అనేక ప్రభుత్వరంగ సంస్థలు పనిచేస్తున్నాయి. టీటీడీ పంపించిన నేతిని పరిశీలించగా... సోయాబీన్, పొద్దుతిరుగుడు, ఆలివ్, గోధుమ, మొక్కజొన్న, పత్తిగింజలతోపాటు చేప నూనె కూడా ఇందులో వాడినట్లు స్పష్టమైంది. వీటితోపాటు బీఫ్ టాలో (గొడ్డు కొవ్వు), పామాయిల్, పంది కొవ్వు కూడా వాడారని తేలింది. సాక్షాత్తు ఆ కలియుగ దైవం వెంకన్నకు నైవేద్యంగా సమర్పించి భక్తులకు అందించే లడ్డూ తయారీలో ఈ కల్తీ నెయ్యినే వాడి, మహా ప్రసాదాన్ని వైసీపీ నేతలు అపవిత్రం చేశారంటే ఇంతకన్నా ఘోరం ఉండదు. వారిని దేవుడు అసలు వదిలిపెట్టడు. అందుకే వైసీపీ నేతలు 11 సీట్లకు పడిపోయి పాతాళంలో పడ్డారు. అయినా సిగ్గు లేకుండా.. చేసిందంతా చేసి చిత్రాంగి ముఖంతో మీడియా ముందుకు వచ్చి జగన్ రెడ్డి కట్టుకథలు చెప్పి తప్పును కప్పిపుచ్చేందుకు యత్నించడం సిగ్గుచేటు.

సరఫరాదారులు పంపించే నెయ్యి నాణ్యతను కూడా పరిశీలించకుండా గత ప్రభుత్వం ఇష్టానుసారంగా శ్రీవారి లడ్డూల వినియోగానికి ఉపయోగించింది. తమిళనాడుకు చెందిన ఏఆర్ ఫుడ్స్ సప్లయ్ చేసిన నేతిని NDDB ల్యాబ్‌కు పంపితే అందులో ఇతర పదార్థాలు ఉన్నట్లు నిర్ధారించారు. వెంటనే టీటీడీ ఆ సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. నాణ్యతను పెంచేందుకు ఫీ ఎక్స్‌పర్ట్ కమిటీని ఏర్పాటు చేసి ఒక నివేదికను కూడా సిద్ధం చేసింది. ఈ ఎక్స్‌పర్ట్ కమిటీలో... ఎన్‌డిఆర్ ఐ, బెంగుళూరు మాజీ ప్రిన్సిపల్ సైంటిస్ట్, డెయిరీ ఎక్స్‌పర్ట్ డా.డి.సురేంద్రనాథ్, హైదరాబాద్‌కు చెందిన డెయిరీ ఎక్స్‌పర్ట్ విజయభాస్కర్‌రెడ్డి, ఐఐయం బెంగుళూరుకు చెందిన ప్రొఫెసర్ బి.మాధవన్, తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ డా స్వర్ణలతలు ఉన్నారు.

### కమిటీ సిఫారసులు

లడ్డూలో వాడే ఆవు నెయ్యి 120 సెల్సియస్ ఉష్ణోగ్రతలో వేడి చేసినదై ఉండాలి. సైంటిఫిక్ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించి 7 నుంచి 9 పాయింట్ల మధ్య నమోదైతేనే పరిగణనలోకి తీసుకోవాలి. తిరుమలకు 800 కి.మీ. దూరంలో ఉన్న డెయిరీల నుంచే నెయ్యిని కొనుగోలు చేయాలి. ఆబ్జెక్టివ్ స్కోరింగ్ మోడల్‌ను ఉపయోగించి నాణ్యమైన ఆవు నెయ్యిని ఉత్పత్తి చేసి సరఫరా చేసే సాంకేతిక సామర్థ్యం కలిగిన కంపెనీలే టెండర్‌కు అర్హత పొందాలి. ఈ నేతిని సరఫరా చేసే కంపెనీలు ఎక్కడ నుంచి పాలు కొనుగోలు చేస్తున్నాయి? ఏ విధంగా సిద్ధం చేస్తున్నాయి? క్వాలిటీ రిపోర్టులు వంటివి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలి. టెండర్లలో ఎవరైనా తక్కువ ధరకు కోట్ చేస్తే ఎందుకు తక్కువ ధరకు కోట్ చేయాల్సి వచ్చిందో సమగ్ర వివరాలతో అఫిడవిట్ కూడా తీసుకోవాలి. ఈ ఏడాది జూన్‌లో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం చేసి పాపాలను ప్రక్షాళన చేసేందుకు పై సిఫారసులను పరిగణనలోకి తీసుకుని నెయ్యి కొనుగోలుకు కొత్త టెండర్లు పిలిచింది.

# చిరంజీవికి విశిష్ట గౌరవం

## గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు




హైదరాబాద్: నాలుగు దశాబ్దాలకు పైగా సినీ ప్రస్థానంలో కోట్లాది అభిమానులను సొంతం చేసుకున్నారు అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి. తాజాగా గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. 156 చిత్రాలు.. 537 పాటలు.. 24వేల స్టెప్పులతో అలరించినందుకు ఆయనకు ఈ రికార్డు దక్కింది. ఈ మేరకు గిన్నిస్ బుక్ ప్రతినిధులు,బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ ఈ అవార్డును ప్రదానం చేశారు. ప్రముఖ దర్శకులు రాఘవేంద్రరావు, బి.గోపాల్, కోదండరామిరెడ్డి, గుణశేఖర్, బాబీతోపాటు నిర్మాతలు అల్లు అరవింద్, అశ్వనీదత్, శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, సురేష్ బాబు, జెమిని కిరణ్, మైత్రి రవిశంకర్, తమ్మారెడ్డి భరద్వాజ, కేఎస్ రామారావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చిరంజీవికి అభినందనలు తెలిపారు. చిరుతో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు.

'పునాదిరాళ్ళు' చిత్రంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు చిరంజీవి. కెరీర్ ఆరంభంలో ఎన్నో సవాళ్లు, అవమానాలు ఎదుర్కొని.. స్టార్ హీరోగా ఎదిగారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ తనదైన నటన, డ్యాన్సులతో యువతను ఉర్రూతలూగించారు. బాక్సాఫీస్ రికార్డులు క్రియేట్ చేశారు. 9 ఫిలింఫేర్, 3 నంది అవార్డులతోపాటు ఎన్నో ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నారు. సినీ రంగానికి ఆయన చేస్తున్న సేవలు గుర్తించిన ప్రభుత్వం 2006లో ఆయనకు పద్మభూషణ్, 2024లో పద్మవిభూషణ్ అందించి గౌరవించింది. సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం ఆయన 'విశ్వంభర కోసం వర్క్ చేస్తున్నారు. వశిష్ట దర్శకత్వంలో ఇది తెరకెక్కుతోంది.

# గిన్నిస్ రికార్డుల్లో అన్నయ్య చిరంజీవి పేరు సంతోషదాయకం

**- డిప్యూటీ సీఎం పవన్**

అమరావతి: అన్నయ్య చిరంజీవికి సినీ ప్రపంచంలో రికార్డులు, విజయాలు కొత్త కాదు.. ఈ రోజు అన్నయ్య పేరు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో లిఖితం కావడం ఎంతో ప్రత్యేకం అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. 156 చిత్రాలు... 537 పాటలు... 24 వేల స్టెప్స్‌తో అలరించిన నటుడిగా చిరంజీవి పేరు నమోదు కావడం ఎనలేని సంతోషాన్ని కలిగించిందన్నారు. 'ద మోస్ట్ ప్రొలిఫిక్ ఫిల్మ్ స్టార్ ఇన్ ఇండియన్ సినిమా' అని గౌరవించడం ప్రతి ఒక్కరికీ ఆనందాన్నిస్తుంది. అన్నయ్య చిరంజీవికి హృదయపూర్వక అభినందనలు తెలియచేస్తున్నానన్నారు.



# మెగాస్టార్ చిరంజీవికి సీఎం చంద్రబాబు అభినందనలు



అమరావతి: గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న మెగాస్టార్ చిరంజీవికి ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. కళాకారుడిగా తెలుగు సినిమాకు చిరంజీవి ఎనలేని సేవ చేశారని కొనియాడారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుని చిరంజీవి మరో మైలురాయిని చేరుకున్నారని ప్రశంసించారు.

# జలపాతంలో ముగ్గురు మెడికోల గల్లంతు

**- గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని మంత్రి పార్థసారథి ఆదేశం**



ఏలూరు: అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా మారేడుమిల్లిలో విహారయాత్రకు వెళ్లిన ఏలూరు ఆశ్రమ వైద్య కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థుల గల్లంతుపై రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని మంత్రి పార్థసారథి అల్లూరి జిల్లా అధికారులను ఆదేశించారు. ఏలూరు జిల్లా ముసునూరు మండలంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పర్యటిస్తున్న మంత్రి పార్థసారథికి విద్యార్థుల గల్లంతు విషయం తెలిసిన వెంటనే ఏలూరు, అల్లూరి జిల్లా కలెక్టర్లను వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలందించాలని, గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

అల్లూరి జిల్లా మారేడుమిల్లిలో జలతరంగిణి జలపాతం వద్ద చోటు చేసుకున్న ఈ ప్రమాదంలో ముగ్గురు ఎంబీబీఎస్ విద్యార్థులు గల్లంతయ్యారు. ప్రమాదవశాత్తు జలపాతంలో ఐదుగురు కొట్టుకుపోగా.. స్థానికులు ఇద్దర్ని కాపాడారు. మరో ముగ్గురి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారిలో ఇద్దరు యువతులు, ఒక యువకుడు ఉన్నారు. మొత్తం 14 మంది వైద్య విద్యార్థులు ఏలూరు నుంచి విహార యాత్రకు వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు.

# రోజుకో కుట్ర, పూటకో అబద్ధం

## పులివెందుల అపరిచితుడు జగన్‌కే సాధ్యం ◆ మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ధ్వజం



అమరావతి(చైతన్యరథం): దేవుడిని అడ్డుపెట్టుకుని తిరుమల లడ్డూపై రాజకీయాలు చేస్తున్నారంటూ వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు విడ్డూరంగా ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి అన్నారు. వైసీపీ నేతలు బొత్స సత్యనారాయణ, కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు కూటమి ప్రభుత్వంపై తప్పుడు విమర్శలు చేస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు. రోజుకో కుట్ర, పూటకో అబద్ధం పులివెందుల అపరిచితుడు జగన్‌రెడ్డికే సాధ్యమని దుయ్యబట్టారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాల యంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో అనేక విజ యాలు సాధించామన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక తొలి వంద రోజుల పాలనలో జగన్ ఏమీ చేయలేదు. అధికారంలోకి వచ్చిన 3 నెలల్లో 250 రూపాయలు పెన్షన్ పెంచడం తప్పితే చేసిందేమీ లేదు. జగన్ చెప్పే మాటలు కోటలు దాటుతాయి. చేతలు మాత్రం గడప దాటవు. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విరివిగా జరిగాయి.

### మంచి పనులు చేస్తుంటే రాళ్లేస్తారా

ఐదేళ్ల పాలనలో వైసీపీ నాయకులు చేసిన అరాచకా లు, అక్రమాలకు లెక్కలేదు. ల్యాండ్,శాండ్, వైన్, మైన్స్ అన్నింటినీ దోచుకున్నారు. వైసీపీ ప్రభుత్వమంటే కుంభకుణాల ప్రభుత్వమనేది జగమెరిగిన సత్యం. జగన్ ప్రభుత్వ హయాంలో నిత్యావసర సరుకుల ధర లు విపరీతంగా పెరిగాయి. విద్యుత్ కోతలు దారుణంగా ఉండేవి. విద్యుత్‌చార్జీల బాదుడే బాదుడు. అనేక పన్నులు వేసి సామాన్య ప్రజల నడ్డివిరిచారు. వైసీపీ హయాంలో ప్రజల ధన, మాన ప్రాణాలకు రక్ష ణ లేకుండా పోయింది.

### పేదల పొట్టకొట్టారు

వైసీపీ అరాచక పాలనతో ప్రజలందరూ విసిగి పోయారు కాబట్టే 11 సీట్లకు పరిమితం చేశారు. కూల్చడమే ప్రాతిపదికగా చేసుకొని మొదట ప్రజా వేదికను కూల్చారు. అది చాలదన్నట్లుగా పేదల కడు పుపై కొట్టారు. అధికారంలోని రాగానే పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను జగన్ మూసేయించారు. నేడు సీఎం చంద్రబాబు పేదల కోసం అన్న క్యాంటీ న్లను పునఃప్రారంభించారు.అన్న క్యాంటీన్లు అవసరం లేదని బొత్ససత్యనారాయణ మాట్లాడడం అన్యాయం. పేదలకు పట్టెడన్నం పెట్టం పాపమా అని ఉండవల్లి ప్రశ్నించారు.

గతంలో వైజాగ్‌లో హుదూద్ తుఫాన్ బీభత్సం సృష్టించిన సమయంలో సీఎం చంద్రబాబు ఆ నగరా నికి వెళ్లి పరిస్థితులు చక్కబడేవరకు బస్సులోనే ఉండి సహాయ, పునరుద్ధరణ చర్యలను స్వయంగా పర్య వేక్షించారు. నేడు వైసీపీ తప్పిదాల కారణంగా బుడ మేరుకు వరద పోటెత్తి విజయవాడలోని పలు ప్రాం తాలు ముంపునకు గురైతే చంద్రబాబు పది రోజుల పాటు కలెక్టరేట్‌లో బస్సులోనే ఉండి పరిస్థితులను సాధారణ స్థితికి తెచ్చారు. బుడమేరుకు పడిన గండ్ల ను యుద్ధప్రాతిపదికన పూడ్చారు. వరదల్లో చని పోయినవారి కుటుంబాలకు రూ.5లక్షలు ఆర్థిక సహా యం అందించారు. జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు వీసమెత్తు సాయం చేయకపోగా నిర్విరామంగా కష్ట పడిన సీఎం చంద్రబాబుపై బురదజల్లి పైశాచికానం దం పొందారని ఉండ వల్లి దుయ్యబట్టారు.

చంద్రబాబు పాలనలో అంద రూ స్వేచ్ఛగా, సంతోషంగా ఉన్నారు. విద్యుత్ కోతలు లేవు. విద్యుత్ ఛార్జీల బాదుడు కార్యక్రమానికి టీడీపీ ప్రభుత్వం ఫుల్ స్టాప్ పెట్టింది. జగన్ కళ్లున్న కబోధిలా కనిపిస్తున్నారు. లేకుంటే చంద్రబాబు వరుసగా హామీల ను అమలు పరచుకుంటూ పోతుంటే... సూపర్ 6, సూపర్ 7 అని వ్యంగ్యంగా మాట్లాడుతున్నారు. జగన్ ఉంటే వృద్ధులకు రూ.3 వేలే పెన్షన్ వచ్చేది. నేడు రూ.4 వేలు వస్తోంది. పెన్షన్‌ను పెంచి, మూడు నెలల బకాయిలతో కలిపి గత జూలై 1వ తేదీన లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి రూ.7 వేలు పింఛన్ అందించటం దేశ చరిత్రలోనే చారిత్రాత్మకం. జగన్ హయాంలో ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు. నేడు సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి 16,400 టీచర్ ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టారు. 1996 నుంచి ఇప్పటి వరకు 9 డీఎస్సీలు నిర్వహించి 2,72,179 టీచర్ ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత చంద్రబాబుది. జగన్ చేయలేని పని చంద్రబాబు చేశారు. మంచి పనులు చేస్తుంటే రాళ్లే స్తారా అని ఉండవల్లి శ్రీదేవి మండిపడ్డారు.

### దేవుడినీ వదల్లేదు

ఐదేళ్లలో ఎన్నో అరాచకాలకు, అక్రమాలకు పాల్ప డిన వైసీపీ నేతలు కనీసం దేవుడినైనా వదిలేస్తారను కున్నాం. చివరికి తిరుమల పవిత్రతను కూడా భ్రష్టు పట్టించారు. మీకు దేవుడిపట్ల భక్తిశ్రద్ధలు లేవు. తిరుమల మహా ప్రసాదమైన లడ్డూ పవిత్రతను నాశనం చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీశారు. దీనికి నిరసనగా తాడేపల్లి ప్యాలెస్ ఎదుట బీజేపీ మోర్చా నాయకులు ధర్నా కూడా చేశారు. ఇక్కడే కాకుండా భోపాల్, హైదరాబాద్ ఇంకా అనేక చోట్ల ఇలాంటి ధర్నాలు జరుగుతున్నాయి. ఇంత నికృష్టంగా ఉంటారా? తిరుమల మహా ప్రసాదం లడ్డూలో జంతు కొవ్వు కలిపిన నెయ్యి వాడడం అపచారం. జంతు కొవ్వు అని నివేదికలో చెప్పలేదని సజ్జల రామకృష్ణారెడ్డి వచ్చి అబద్ధాలు చెబుతున్నారు. ఎన్డీడీబీ ల్యాబ్ ఇచ్చిన రిపోర్టునే తప్పుపడతారా? ఏదేమైనా ఇంత ఘోరమైన అపచారానికి పాల్పడ్డవారికి శిక్ష తప్పదని ఉండవల్లి శ్రీదేవి స్పష్టం చేశారు.

---

# తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన జగన్ ప్రభుత్వం

- తెలియక స్వీకరిస్తే దోష నివారణ మార్గమేమిటి?
- ఆగమ పండితులు తెలియజేయాలి
- తిరుమలలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలి
- జగన్ తప్పులన్నీ బయటకు రావాలి
- నేడు తిరుమల లడ్డూ నాణ్యమైన నెయ్యితో మెత్తగా ఉంటోంది
- టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చిరాం ప్రసాద్



అమరావతి(చైతన్యరథం): జంతు కొవ్వు కలిపిన నెయ్యితో చేసిన లడ్డూ ప్రసాదం స్వీకరించిన దోషం ఎలా పోతుందో ఆగమ శాస్త్రం తెలిసిన పండితులు తెలియజేయాలని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ కోరారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ సర్వ నాశనం చేశారని విమర్శించారు. చివరికి కలియుగ దైవం వెంకటేశ్వర స్వామిని కూడా వదలలేదు. తిరుమల లడ్డూలో నాణ్యత లేదని 2023, ఆగస్టులోనే మేము చెప్పాం. సరైన నెయ్యి, పదార్థాలు లడ్డూలో ఉండటం లేదని, లడ్డూలో నెయ్యి వాసన లేదని, లడ్డూ రుచికరంగా లేదు అని ఇదే వేదికపై సమావేశం ఏర్పాటు చేసి చెప్పాము. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలని కోరాము. వైసీపీ ప్రభుత్వ హయాంలో రకరకాల కంపెనీల నుంచి టీటీడీ ఆవు నెయ్యిని కొనుగోలు చేసింది. నెయ్యి సరఫరాలో కూడా రివర్స్ టెండరింగ్ పాలసీని అవలంబించారు. టీడీపీ హయాంలో తయారు చేసిన లడ్డూలో జీడిపప్పు, బాదమ్, కిస్‌మిస్ లు ఎక్కువగా ఉండేవి. జగన్ హయాంలో అవి కనపడేవి కాదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక తిరుమలలో పెద్ద పెద్ద జీడిపప్పులు, బాదమ్, కిస్‌మిస్‌లతో నాణ్యమైన లడ్డూ తయారవుతోంది. పైగా మెత్తగా కూడా ఉంటోంది. లడ్డూని ముట్టుకోగానే చేతికి నెయ్యి తగులుతోంది. వైసీపీ హయాంలో లడ్డూ ఎండిపోయినట్లుగా ఉండేదని బుచ్చి రాంప్రసాద్ అన్నారు.

### దోష నివారణ మార్గం తెలియజేయాలి

తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లినవారు ఇంటికొచ్చేవరకు మాంసాహారం తినరు. కానీ వైసీపీ హయాంలో తిరుమల లడ్డూ తినిపించి మాంసాహారం తినేలా చేశారు. పవిత్రంగా భావించే తిరుమల లడ్డూను అపవిత్రం చేశారు. ఇదంతా మన ఖర్మగా భావించాలి. గత ఐదేళ్లలో హిందువుల దారుణంగా మనోభావాలు దెబ్బతిన్నాయి. తిరుమల లడ్డూలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు పదార్థాలు కలుస్తున్నాయని సీఎం చంద్రబాబు చెప్పినప్పుడు విని బాధపడ్డాను.

ఇలాంటి సొసైటీలోనా మనం బతుకుతున్నది అని కలత చెందాను. బ్రాహ్మణులు మాంసాహారం తినరని అందరికీ తెలుసు. జంతు కొవ్వు కలిపిన నెయ్యితో తయారైన లడ్డూలను తిన్నామని తెలిస్తే... పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. తిరుమలను ప్రక్షాళన చేయాలి. తెలియక తప్పు చేస్తే ఏ విధంగా ఆ తప్పును సరి చేసుకోవచ్చో ఆగమ శాస్త్రం తెలిసినవారిని అడగాలి. మాంసాహారం తిననివారు తెలియక తినేస్తే ఏం చేయాలో తెలుసుకొని సరిదిద్దుకోవాలి. ఆగమ శాస్త్రం తెలిసిన వారు ఏ విధంగా ఈ దోషం వదులుతుందో పత్రికా ముఖంగా తెలియ చేయాలని బుచ్చి రాంప్రసాద్ కోరారు.

### జగన్ విమర్శల హాస్యాస్పదం

ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి లడ్డూను రాజకీయాలకు వాడుకుంటున్నాడని జగన్ చెప్పడం హాస్యాస్పదం. అలిపిరిలో చంద్రబాబు పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకున్నప్పుడు తిరుపతి వెంకటేశ్వర స్వామి నాకు మరో జన్మ ఇచ్చారని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆయన ఎప్పుడూ టీటీడీని రాజకీయాలకు వాడలేదు. అటువంటి ఆలోచన జగన్ కే ఉంది. టీటీడీని లాబీయింగ్‌లకు వాడుకున్నది వైసీపీ ప్రభుత్వమే. జగన్ ఐదేళ్లలో ఒక్కసారైనా సతీ సమేతంగా తిరుమలకు వెళ్లారా? వెంకటేశ్వర స్వామినే ఇంటికి తెప్పించుకున్న ఘనత జగన్‌కే దక్కుతుంది. ప్రధాన మంత్రికి లేఖ రాస్తానని జగన్ అంటున్నారు. ఏమని రాస్తారు? చంద్రబాబుకు అక్షింతలు వేయాలంటున్నారు. చంద్రబాబుకు కాదు మీకు పడతాయి. జగన్ చేసిన తప్పులను ప్రజలు గమనించే ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారు. జగన్ చేసిన తప్పులన్నీ బయటికి రావాలి. అవన్నీ ప్రజలకు తెలియాలి. తిరుమలలో జరిగిన అక్రమాలపై విచారణ జరగాలి. జగన్ హయాంలో తిరుమలలో ప్రసాదాలకు వాడే పదార్థాల్లో నాణ్యత లోపించింది. సింహాచలంలో కూడా ప్రసాదాల తయారీలో నాణ్యమైన నెయ్యి వాడడంలేదని తెలిసింది. దీనిపై కూడా చర్యలు తీసుకోవాలి. తిరుమలకు సమీపంలో ఉన్న పది ఎకరాల స్థలాన్ని విలీనం చేయదలచుకుంటే దానికి వైసీపీ నాయకులు అడ్డు తగిలారు. అందుకు జనసేన, బీజేపీ కూడా పోరాడింది. దీన్ని ముంబై వారికి కట్టబెట్టాలని వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించింది. వీటిపై కూడా విచారణ జరిపించాలి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇటువంటి తప్పులు అనేకం చేశారు. వారిని వదలిపెట్టకుండా కఠినంగా శిక్షించాలి. భక్తుల మనోభావాలకు భంగం కలగకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు చూస్తారనే నమ్మకం ప్రతి ఒక్కరిలో వుంది. భ్రష్టు పట్టించిన వ్యవస్థలను బాగు చేసే పనిలో సీఎం చంద్రబాబు ఉన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసిన ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారని బుచ్చిరాం ప్రసాద్ స్పష్టం చేశారు.



సాలూరులోని 11వ వార్డ్ లో "ఇది మంచి ప్రభుత్వం-ప్రజా వేదిక"లో పాల్గొన్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

# రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## ◆పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ స్పష్టీకరణ

పెడన, చైతన్యరథం: రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు, అవసరాలకు అనుగుణంగా పాలన సాగిస్తారని పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం పెడన పట్టణంలో మార్కెట్ యార్డు వద్ద నిర్వహించిన "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమానికి కాగిత కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడారు. "ఇది మంచి ప్రభుత్వం" ఎందుకంటే సంక్షోభంలోనూ సంక్షేమం అందించి, అభివృద్ధికి అడుగులు మొదటి 100 రోజుల్లోనే వేయడంతో ప్రజలు ప్రశంసిస్తున్నారని అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు తెలియజేసే కరపత్రాల పంపిణీ, స్టిక్కర్లు అంటించే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మాటలకే పరిమితం కాకుండా ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చే దిశగా అడుగులు వేస్తూ ప్రజా సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. అందులో భాగంగా మెగా డీఎస్సీతో 16.437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీని చేపట్టి నిరుద్యోగ యువతకు అండగా నిలబడుతుందని అన్నారు. ఎదల కోసం రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 5 రూపాయలతోనే ఆకలి తీర్చే 175 అన్న క్యాంటీన్లను,



ప్రజలకు నిద్ర లేకుండా చేసిన "ల్యాండ్ టైటిలింగ్యాక్ట్"ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తూ, పింఛన్లు ఒకేసారి రూ.3000 నుంచి రూ.4 వేలు ఇవ్వడం ఒకటైతే... మొదటి నెల ఒక్కొక్కరికీ రూ.7000లు చొప్పున ఒకేరోజు 65.18 లక్షల మందికి ఇంటింటికీ వెళ్లి రూ.4,408 కోట్లు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు . దేశంలోనే ఒక తిరుగులేని సంక్షేమ చరిత్ర అన్నారు. అంతే కాకుండా ప్రతి నెలా ఒకటో తారీఖునే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు వర్ధంతి సందర్భంగా ప్రకాశం జిల్లా నాయుడుపాలెంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా, వైద్య, రక్తదాన శిబిరాలను ప్రారంభించిన మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఒంగోలు పార్లమెంటు టీడీపీ అధ్యక్షులు నూకసాని బాలాజీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య తదితరులు

# తిరుమల పవిత్రతను దెబ్బతీసిన ద్రోహులకు ఉరి శిక్ష వేయాలి

## ◆టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

## లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ డిమాండ్

విజయవాడ, చైతన్యరథం: తిరుమల పవిత్రతను దెబ్బతీసిన ద్రోహులకు ఉరి శిక్ష వేయాలని టీడీపీ రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ వేరే మత ప్రయోజనాల కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువుల మనోభావాలను దెబ్బతీయడం దారుణమన్నారు. వెంకటేశ్వర స్వామి వారికి ఇష్టమైన లడ్డు అంటే భూదేవి అని, అలాంటి భూదేవిని పంది కొవ్వు, చేప కొవ్వు, ఇంకా నాసిరకం డాల్డా లాంటి వాటిని కలిపి, అపవిత్రం చేసి, వికృతానందం పొందిన జగన్ రెడ్డి, వైవి సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, ధర్మారెడ్డిలను వెంటనే అరెస్ట్ చేసి, ప్రాసిక్యూషన్ చేయాలన్నారు. హిందువులే కాకుండా తిరుమలకు వచ్చే భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా గత జగన్ రెడ్డి ప్రభుత్వం ప్రవర్తించిందన్నారు. హిందూ ధర్మంపై నమ్మకం లేని నాస్తికులైన భూమన కరుణాకర్ రెడ్డి, వై వి సుబ్బారెడ్డి లను టీటీడీ ఛైర్మన్‌గా నియమించి గత ఐదు సంవత్సరాలుగా టీటీడీ పవిత్రతను దెబ్బతీశారని అన్నారు. గత జగన్ రెడ్డి పాలనలో కూడా భక్తుల నుండి అనేక ఫిర్యాదులు వచ్చాయని, కానీ అధికారులు జగన్ రెడ్డి చెప్పు చేతల్లో ఉండటం వల్ల పట్టించుకునే నాథుడు లేకపోయారన్నారు. జగన్ రెడ్డికి హిందూ ధర్మం పట్ల గౌరవం లేదన్నారు. భార్యాభర్తలతో వెళ్లి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి బద్దకంతో, తాడేపల్లి కొంపలోనే తిరుపతి సెట్టింగ్ వేసుకున్న ఘనుడు జగన్ రెడ్డి అన్నారు. తిరుమలలోనే కాకుండా రాష్ట్రంలో ఉన్న దేవాలయాల్లో కూడా ఇటువంటి అపవిత్రమైన కార్యక్రమం జరిగిందన్న అనుమానాలు లేకపోలేదన్నారు. తిరుమల లడ్డు కల్తీ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. పవన్ కళ్యాణ్ 11 రోజులు దీక్ష చేపట్టడం హర్షణీయమని అన్నారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా బీసీ గౌడ సాధికారిక కన్వీనర్ పామర్తి కిషోర్ బాబు, ఎన్టీఆర్ జిల్లా టీఎన్టీయూసీ నాయకులు కోడూరు అంజనేయ వాసు పాల్గొన్నారు.



వంద రోజుల పాలన ప్రగతికి "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాయదుర్గం పట్టణంలోని 13వ వార్డులో ప్రజావేదికకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## ◆రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్

## సుగవాసి బాలసుబ్రహ్మణ్యం

రాజంపేట, చైతన్యరథం: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాజంపేట నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ సుగవాసి బాలసుబ్రహ్మణ్యం అన్నారు. రాష్ట్రంలో 100 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా ఆదివారం "ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదిక" కార్యక్రమాన్ని వీరబల్లి మండలం పెదవీడు గ్రామ పంచాయితీ రెడ్డివారిపల్లె జిల్లాపరిషత్ హైస్కూల్‌లో నిర్వహించారు. ప్రజావేదికలో పాల్గొన్న సుగవాసి బాలసుబ్రహ్మణ్యం 100 రోజుల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గ్రామానికి వచ్చిన ఇంచార్జ్ సుగవాసి బాలసుబ్రమణ్యంకు మండల టీడీపీ నాయకులు శ్రీధర్ రెడ్డి,




సురేంద్ర రెడ్డి, తెలుగుదేశం, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.



రాప్తాడు నియోజకవర్గం, రామగిరి మండలం, కుంటిమద్ది గ్రామంలో చిన్నారులతో కలసి కేక్ కట్ చేసి 100 రోజుల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత




గాజువాక 69వ వార్డులో జరిగిన "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు , ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కూటమి నాయకులు




# అశ్విన్‌కు ఆరు వికెట్లు..

## ◆తొలిటెస్ట్‌లో బంగ్లాపై భారత్ ఘనవిజయం

చెన్నై: తొలి టెస్టులో బంగ్లాదేశ్‌పై భారత్ ఘన విజయం సాధించింది. 515 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లా 234 పరుగులకు ఆలౌటైంది. భారత్ 280 పరుగుల తేడాతో గెలిచింది. బంగ్లా కెప్టెన్ షాంటో (82) హాఫ్ సెంచరీ సాధించాడు. భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆరు వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా 3, బుమ్రా ఒక వికెట్ తీశారు. తొలి ఇన్నింగ్స్ లో భారత్ 376 పరుగులు చేయగా.. బంగ్లాదేశ్ 149 పరుగులకే ఆలౌటైంది. అనంతరం భారత్ రెండో ఇన్నింగ్స్ లో 287/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. దీంతో రెండు టెస్టుల సిరీస్లో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రెండో టెస్టు సెప్టెంబర్ 27 నుంచి కాన్పూర్ వేదికగా ప్రారంభం కానుంది.

### కాసేపే పోరాటం..

ఓవర్నైట్ 158/4 స్కోరుతో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన బంగ్లాదేశు కెప్టెన్ షాంటోతో కలిసి షకిబ్ అల్ హసన్ (25) కాసేపు అడ్డుకోగలిగాడు. వీరిద్దరూ ఐదో వికెటుకు 48 పరుగులు జోడించారు. ఎప్పుడైతే రవిచంద్రన్ అశ్విన్ బంతిని అందుకొన్నాడో.. బంగ్లా పతనం మొదలయింది. షకిబ్‌ను ఔట్ చేసిన అశ్విన్ నాలుగో రోజు వికెట్ల వేటను ప్రారంభించాడు. అద్భుతమైన బంతికి లిటన్ దాస్ (1)ను జడేజా బోల్తా కొట్టించాడు. చివరి ఆరు వికెట్లలో అశ్విన్, జడ్డూ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. లంచ్ బ్రేక్ లోపే బంగ్లాను ఆలౌట్ చేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా రవిచంద్రన్ అశ్విన్ నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతోపాటు ఆరు వికెట్లు తీసిన బౌలర్ గా ఘనత సాధించాడు. అశ్విన్ ఇప్పటి వరకు టెస్టుల్లో 37 సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు.

### డబ్ల్యూటీసీలో భారత్ పాయింట్లు ఇలా..

బంగ్లాపై భారీ విజయంతో టీమ్ ఇండియా ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ పాయింట్ల పట్టికలో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ప్రస్తుతం భారత్ 71.07 శాతంతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. బంగ్లాదేశ్ 39.3 శాతంతో ఆరో స్థానానికి పడిపోయింది.

# బౌలర్లదే కీలక పాత్ర: రోహిత్

తొలి టెస్టులో బంగ్లాదేశ్‌ను ఓడించడంలో బౌలర్లు కీలక పాత్ర పోషించారని.. స్పిన్ ఆల్‌రౌండర్లు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా అద్భుత ఆటతీరు ప్రదర్శించినట్లు భారత కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. సెంచరీలు సాధించిన శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్‌పైనా ప్రశంసల వర్షం కురిపించాడు. బంగ్లాను 280 పరుగుల తేడాతో టీమ్ ఇండియా ఘన విజయం సాధించింది. గెలిచిన అనంతరం రోహిత్ శర్మ మాట్లాడాడు. అద్భుత విజయం సాధించాం. చాన్నాళ్ల తర్వాత టెస్టు క్రికెట్ ఆడాం. కానీ, క్రికెట్ నుంచి బయటకు వెళ్లలేదు. వరుసగా మ్యాచ్‌లు ఆడుతూనే ఉన్నాం. వారం ముందే ఇక్కడికి వచ్చాం. అనుకున్నట్లుగానే ఫలితం రాబట్టాం. ప్రతి ఒక్కరూ తమ పాత్ర పోషించారు. రిషబ్ పంత్ టెస్టుల్లోకి అడుగు పెట్టి దాదాపు 20 నెలలు అయింది. ఐపీఎల్, వరల్డ్ కప్ లో ఆడినప్పటికీ..దులీప్ ట్రోఫీ అతడికి చాలా ఉపయోగపడింది. గిల్ కూడా మళ్లీ టెస్టుల్లో మంచి ప్రదర్శన ఇచ్చాడు. మేం భారత్‌లో ఆడినా.. వెలుపల ఆడినా ఎలాంటి పరిస్థితుల్లోనైనా విజయం కోసమే పోరాడతాం. జట్టును అన్ని విధాలుగా బలోపేతం చేసుకున్నాం. నాణ్యమైన పేసర్లూ ఉన్నారు. లోకల్ హీరో రవిచంద్రన్ అశ్విన్‌కు తోడుగా రవీంద్ర జడేజా చెలరేగిపోయాడు. బ్యాటింగ్‌లోనూ తమ సత్తా ఏంటో ఆటగాళ్లు మరోసారి నిరూపించారన్నాడు.




# టెస్టుల్లో 179వ విజయాన్ని అందుకున్న భారత్

●టెస్టుల్లో ఓటముల సంఖ్యను విజయాల సంఖ్య అధిగమించడం ఇదే తొలిసారి

●ఇప్పటివరకు 581 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 178 సార్లు ఓడిన భారత్

చెన్నై టెస్టులో బంగ్లాదేశ్‌పై టీమిండియా ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఏకంగా 280 పరుగుల తేడాతో గెలిచింది. ఈ విజయంతో భారత్ చారిత్రాత్మక రికార్డును సొంతం చేసుకుంది. 92 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో తొలిసారి మొత్తం ఓటముల సంఖ్యను విజయాల సంఖ్య అధిగమించింది. బంగ్లాదేశ్‌పై దక్కింది భారత్‌కు 179వ విజయం.. కాగా 178 మ్యాచ్‌ల్లో టీమిండియా ఓటములను మూటగట్టుకుంది. కాగా టెస్ట్ ఫార్మాట్‌లో భారత్ ఇప్పటివరకు మొత్తం 581 మ్యాచ్‌లు ఆడింది.

### టెస్టుల్లో ఓటముల కంటే విజయాలు ఎక్కువ సాధించిన జట్లు ఇవే...

1. ఆస్ట్రేలియా: విజయాలు- 414, ఓటములు -232
2. ఇంగ్లండ్: విజయాలు - 397, అపజయాలు -325
3. దక్షిణాఫ్రికా: గెలుపులు -179, ఓటములు - 161
4. ఇండియా: విజయాలు- 179, అపజయాలు -178
5. పాకిస్థాన్: విజయాలు- 148, ఓటములు - 144

1932లో సీకే నాయుడు కెప్టెన్సీలో భారత్ మొట్టమొదటి టెస్ట్ మ్యాచ్‌ను ఆడింది. ఆ మ్యాచ్‌లో 158 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఆ మ్యాచ్ తర్వాత ఒక్కసారి కూడా ఓటముల కంటే అధికంగా విజయాలు నమోదు కాలేదు. ఎల్లప్పుడూ ఓటముల సంఖ్యే అధికంగా ఉంటూ వచ్చింది. 92 ఏళ్ల ఈ సుదీర్ఘ నిరీక్షణకు బంగ్లాదేశ్‌పై విజయం రూపంలో తెరపడింది. కాగా టెస్టుల్లో ఓటముల సంఖ్య కంటే విజయాలు ఎక్కువ సాధించిన జట్ల జాబితాలో భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్ కూడా ఉన్నాయి.

# దేవర ముందస్తు వేడుక రద్దు

'దేవర' విడుదల ముందస్తు వేడుక రద్దయ్యింది. నోవాటెల్ హోటల్‌లో తలపెట్టిన ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి పరిమితికి మించి అభిమానులు రావడంతో వేదిక ప్రాంగణంలో గందరగోళ పరిస్థితి నెలకొంది.



జనరల్ పాసులు పొందిన వారూ వీఐపీ గ్యాలరీలోకి, సెలబ్రిటీ గ్యాలరీలోకి దూసుకెళ్లడంతో తోపులాట జరిగింది. ఆడిటోరియం నిండిపోవడంతో కొంతమంది బయటే ఉండాల్సి వచ్చింది. కొందరు అభిమానులు హోటల్ అద్దాలు, కుర్చీలు పగలగొట్టడం ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు నిలువరించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. హోటల్ యాజమాన్యం అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆర్గనైజర్స్ ఈవెంట్‌ను రద్దు చేశారు. అతిథిగా విచ్చేసిన దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాత నాగవంశీ వెనుదిరిగి వెళ్లారు. ఎన్టీఆర్ హీరోగా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రమిది. జాన్వీ కపూర్ హీరోయిన్. సైఫ్ అలీఖాన్ కీలక పాత్ర పోషించారు. ఈ నెల 27న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న నేపథ్యంలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కాగా ఇది రద్దయ్యింది.

# పవన్ ఓజీలో శింబు పాట

పవన్ కళ్యాణ్ హీరోగా రూపొందుతున్న చిత్రాల్లో 'ఓజీ' ఒకటి. సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా ఇది. తమన్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్న ఈ మూవీలో కోలీవుడ్ నటుడు శింబు ఓ పాట పాడనున్నారంటూ ఇటీవల ప్రచారం జరిగింది. ఇప్పుడు దానిపై స్పష్టత వచ్చింది. శింబుతో కలిసి తమన్, సుజీత్ దిగిన ఫొటోను సోషల్ మీడియాలో పంచుకుంటూ నిర్మాణ సంస్థ క్లారిటీ ఇచ్చింది. త్వరలోనే పాటను విడుదల చేయనున్నట్లు సమాచారం. గ్యాంగ్ స్టర్ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్‌గా 'ఓజీ' తెరకెక్కుతోంది. ప్రియాంకా మోహన్ హీరోయిన్. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ విలన్‌గా కనిపించనున్నారు. రాజకీయాల్లో బిజీ అయిన పవన్ కల్యాణ్ 'హరి హర వీరమల్లు', 'ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రాలు సైతం పూర్తి చేయాల్సి ఉంది. 'హరి 'హర వీరమల్లు' సినిమా షూటింగ్ ఈ నెల 23న పునః ప్రారంభం కానుంది. అదే రోజు పవన్ సెట్‌లో అడుగుపెట్టనున్నారు.



# రైలు పట్టాలపై మినీ గ్యాస్ సిలిండర్, సిమెంట్ ఇటుకలు

◆కాన్పూర్, అజ్మీర్‌లలో దుండగుల దుశ్చర్యలు

◆తృటిలో తప్పిన పెను ముప్పు

కాన్పూర్: ఇటీవల రైళ్లు పట్టాలు తప్పాలనే కుట్ర సంఘటనలు ఎక్కువయ్యాయి. తాజాగా రైలు పట్టాలపై మినీ గ్యాస్ సిలిండర్ కలకలం రేపింది. రైలు పట్టాలు తప్పాలనే కుట్రతో గుర్తు తెలియని వ్యక్తులు ఈ ఘటనకు పాల్పడ్డారు. రైల్వే ట్రాక్‌పై సిలిండర్ అమర్చిన ఘటన ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో చోటుచేసుకొంది. ప్రేమ్‌పూర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఢిల్లీ - హౌరా రైల్వే మార్గంపై దీనిని గుర్తించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రైల్వే పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. అలాగే అజ్మీర్ సమీపంలోని పట్టాలపై సిమెంట్ ఇటుకలను అధికారులు గుర్తించడంతో ప్రమాదం తప్పింది.

కాన్పూర్‌లో పట్టాలపై గ్యాస్ సిలిండర్‌ను గుర్తించే సమయానికి లూప్‌లైన్‌లో కాన్పూర్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు ఒక గూడ్స్ రైలు వెళ్తోంది. ఒక ఎక్స్‌ప్రెస్ రైలుకు దారిచ్చే క్రమంలో దానిని ఆపారు. అదే సమయంలో లోకోపైలట్ ట్రాక్‌పై సిలిండర్‌ను గమనించి వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చాడు. దాంతో పెను ప్రమాదం తప్పింది.

రైళ్లను పట్టాలు తప్పించి, ప్రమాదాలకు గురిచేసేలా కుట్రపూరిత ప్రయత్నాలు ఇటీవల కాలంలో పెరిగాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.



గత ఆగస్టు నుంచి ఈ తరహాలో 18 ఘటనలు వెలుగుచూశాయని రైల్వేశాఖ తెలిపింది. కొందరు దుండగులు పట్టాలపై ఎల్‌పీజీ సిలిండర్లు, సైకిళ్లు, ఇనుప రాడ్లు, సిమెంట్ ఇటుకలను పెట్టి రైళ్లకు ప్రమాదం తలపెట్టేలా దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ప్రకటించింది. గత ఏడాది జూన్ నుంచి ఈ తరహాలో 24 ఘటనలు జరిగాయని భారత రైల్వే నివేదిక వెల్లడించింది. అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆ తర్వాత పంజాబ్, జార్ఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా, తెలంగాణలో ఈ కుట్రపూరిత యత్నాలు బయటపడ్డాయి. ఇలాంటి దుశ్చర్యలవల్లనే ఆగస్టులో కాన్పూర్ సమీపంలో సబర్మతి ఎక్స్‌ప్రెస్‌లో 20 బోగీలు పట్టాలు తప్పాయి. ట్రాక్‌పై ఉంచిన ఓ వస్తువు కారణంగా ప్రమాదం జరిగిందని తేలింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంపై అంతా ఊపిరి పీల్చుకున్నారు.

తాజాగా ఆదివారం కాన్పూర్, రాజస్థాన్‌లోని అజ్మీర్‌లోను ఈ ఘటనలు వెలుగుచూశాయి. ప్రయాగ్‌రాజ్ నుంచి భివానీకి వెళ్తున్న కాళింది ఎక్స్‌ప్రెస్ కాన్పూర్ సమీపంలో పట్టాలపై ఉన్న గ్యాస్ సిలిండర్‌ను ఢీకొట్టింది. దాంతో ట్రాక్‌పై ఏదో అనుమానాస్పద వస్తువు ఉన్నట్లు గుర్తించిన లోకోపైలట్ వెంటనే అత్యవసర బ్రేకులు వేశారు. అయినప్పటికీ రైలు ఆ సిలిండర్‌ను ఢీకొనడంతో అది పట్టాలకు కొంత దూరంలో ఎగిరిపడింది. అయితే రైలుకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. లోకోపైలట్, రైల్వే గార్డు దీనిపై పోలీసులకు సమాచారమిచ్చారు. పట్టాల సమీపంలో ధ్వంసమైన సిలిండర్‌తోపాటు ఒక పెట్రోల్ బాటిల్, అగ్గిపెట్టె, నాలుగు గ్రాముల పేలుడు పదార్థాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

అజ్మీర్ సమీపంలోని పట్టాలపై సిమెంట్ ఇటుకలను అధికారులు గుర్తించడంతో ప్రమాదం తప్పింది. ఇలాంటి పట్టాలు తప్పించే కుట్రలు ఎంతోకాలం సాగవని ఇటీవల కేంద్ర మంత్రి అమిత్ షా హెచ్చరించారు. ఇప్పటికే వీటిపై దర్యాప్తును ముమ్మరం చేశామని పేర్కొన్నారు. నిందితులను కఠినంగా శిక్షిస్తామని షా హెచ్చరించారు.

# ఉగ్రవాదం నిర్మూలించేవరకూ పాక్‌తో చర్చల్లేవు

◆370 అధికరణ పునరుద్ధరించం

◆కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టీకరణ



రాజౌరి: ఉగ్రవాదాన్ని అంతమొందించేంత వరకూ పాకిస్థాన్‌తో చర్చల ప్రసక్తే లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. నేషనల్ కాంగ్రెస్, కాంగ్రెస్ సహా వివిధ విపక్షాలు డిమాండ్ చేస్తున్నట్టుగా 370 అధికరణ రద్దును తిరిగి పునరుద్ధరించేది లేదన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నౌషెరాలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా మాట్లాడారు.

"370వ అధికరణను తిరిగి తెస్తామని ఫరూక్ అబ్దుల్లా చెబుతున్నారు. ఫరూక్ సాహెబ్.. 370 అధికరణను ఎవరూ వెనక్కి తేలేరు. ఇప్పుడు బంకర్లు అవసరం లేదు. బుల్లెట్లు కాల్చడానికి ఎవరికీ దమ్ము సరిపోదు" అని అమిత్‌షా అన్నారు. షేక్ అబ్దుల్లా జెండాను తిరిగి తేవాలని వారనుకుంటున్నారని, కానీ జమ్మూకశ్మీర్‌లో ఎగిరేది మన త్రివర్ణ పతాకం మాత్రమేనని స్పష్టం చేశారు. 30 ఏళ్లుగా ఉగ్రవాదం కొనసాగుతోందని, 30 ఏళ్లలో 3000 రోజులు జమ్మూలో కర్ఫ్యూ విధించారని, 40 వేల మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మళ్లీ ఆ రోజులు ఎలా తేవాలనుకుంటున్నారో ఫరూక్ అబ్దుల్లానే చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. జమ్మూకశ్మీర్ తగలబడుతుంటే ఫరూక్ అబ్దుల్లా మాత్రం లండన్‌లో హాలిడేస్ గడిపారంటూ అమిత్‌షా విమర్శలు గుప్పించారు.

"పాకిస్థాన్‌తో చర్చలు జరపాలని వాళ్లు అంటున్నారు. అయితే ఉగ్రవాదం అంతమొందేంత వరకూ చర్చలు కుదరదని మేము అంటున్నాం. జైళ్ల నుంచి ఉగ్రవాదులను విడిచిపెట్టాలని వారు కోరుకుంటున్నారు. ఏ ఒక్క ఉగ్రవాదని కానీ, రాళ్లు రువ్వే వాళ్లను కానీ జైళ్ల నుంచి విడిచిపెట్టేది లేదు. బీజేపీ ఇందుకు హామీగా ఉంటుంది" అని అమిత్‌షా స్పష్టం చేశారు. కాంగ్రెస్, ఎన్‌సీ, పీడీపీలు గత 70 ఏళ్లుగా కొండ ప్రాంతాలలో ఉండేవారికి రిజర్వేషన్ హక్కులు లేకుండా చేసిందని, మోదీ మాత్రం కొండ ప్రాంతాల ప్రజలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు.



# ఏపీలో రెండు రోడ్డు ప్రమాదాలు

◆ఏడుగురు దుర్మరణం

అనంతపురం, నెల్లూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండుచోట్ల ఆదివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో మొత్తం ఏడుగురు మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆయా సంఘటన ప్రదేశాలకు చేరుకుని క్షతగాత్రులను సమీప ఆస్పత్రులకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం, దయ్యాకుంటపల్లి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వస్తున్న లారీ, ఇన్నోవా వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇన్నోవాలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు అక్కడిక్కడే మృతి చెందారు. మృతులు అనంతపురం నగరానికి చెందినవారుగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇదిలావుండగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. చిల్లకూరు వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. అరుణాచలం దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. మృతులు నెల్లూరు నగరం వనంతోపుకి చెందిన జగదీశ్ (50), బాబు (45), వెన్నెల (8) గా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఉన్నత చదువులు.. గంజాయి విక్రయాలు

◆పట్టుబడ్డ ఇద్దరు తమిళనాడు ఐఐటీ విద్యార్థులు

◆మరోచోట గంజాయి అమ్ముతూ దొరికిన టెకీ

హైదరాబాద్: చదివేది ఉన్నత చదువులు.. చేసేది గంజాయి వ్యాపారం.. దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో చదువుతూ, చెడు వ్యసనాలకు అలవాటు పడి గంజాయి అమ్ముతూ



పట్టుబడ్డారు ఇద్దరు ఐఐటీ విద్యార్థులు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, ఎస్‌టీఎఫ్ ఈఎస్ నంద్యాల అంజిరెడ్డి కథనం ప్రకారం.. ఏపీలోని నెల్లూరుకు చెందిన కొలి మణికంఠ చౌదరి, గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన పవన్.. తమిళనాడులోని ఐఐటీ క్యాంపస్‌లో చదువుతున్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి గంజాయి అమ్మి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా హైదరాబాద్‌లోని ఎస్‌ఆర్ నగర్‌లో ఉన్న ఓ హాస్టల్‌లో తమ దందా నడుపుతున్నారు. రూ.వెయ్యికి 20 గ్రాములు చొప్పున అమ్ముతున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హాస్టల్‌పై దాడిచేసి ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద 1.2 కిలోల గంజాయితో పాటు 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరికి గంజాయి సరఫరా చేస్తున్న విశాఖపట్టణానికి చెందిన కమలేశ్, అమోశ్‌పై కేసు నమోదు చేశారు. నిందితుల వద్ద గంజాయి కొనుగోలు చేసిన 22 మందిని గుర్తించి, వారిపైనా కేసులు పెట్టారు. అదేవిధంగా, నెల్లూరు జిల్లాకు చెందిన ఎర్రగంటి లోకేశ్.. నగరంలోని ఒక ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. గంజాయి మత్తుకు అలవాటు పడటంతో ఉద్యోగం పోయింది. దీంతో గంజాయి విక్రయాలనే వృత్తిగా మార్చుకున్న లోకేశ్.. మణికొండలో ఇల్లు అద్దెకు తీసుకుని దందా కొనసాగించాడు. సమాచారం అందుకున్న ఆబ్కారీ అధికారులు నిందితుడిని అరెస్టు చేసి, అతడి వద్ద 1.74 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరా చేసిన నెల్లూరు వాసి శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశారు.

# హైదరాబాద్‌లో ఎన్ఐఏ సోదాలు

హైదరాబాద్: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు ఆదివారం హైదరాబాద్‌లో సైదాబాద్ శంఖేశ్వర్ బజార్ గ్రీన్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో సోదాలు నిర్వహించారు. దాదాపు గంటపాటు సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఆగస్టులో ఉగ్రవాది రిజ్వాన్ అబ్దుల్‌ను ఎన్ఐఏ అరెస్టు చేసింది. అతనికి అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐసిస్‌తో సంబంధం ఉన్న మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదిగా గుర్తించింది. రిజ్వాన్ అబ్దుల్ ఐసిస్ తరఫున పుణే నుంచి కార్యకలాపాలను నిర్వహిస్తున్నాడని తేలింది. అతడిని ఢిల్లీలోని గంగాబక్ష్ మార్గ్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ సమయంలో రిజ్వాన్ నుంచి 30 బోర్ పిస్టల్, 3 కాట్రిడ్జ్‌లు, రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు.




ఆ తర్వాత రిజ్వాన్‌పై ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటికే రిజ్వాన్ తలపై రూ.3 లక్షల రివార్డు ఉన్నది. అరెస్టు అనంతరం ఎన్ఐఏ అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టింది. రిజ్వాన్ ఇచ్చిన సమాచారం ఆధారంగానే హైదరాబాద్‌లో ఎన్ఐఏ తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తున్నది. సైదాబాద్ శంఖేశ్వర్ గ్రీన్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో రిజ్వాన్ కొద్దినెలలు ఉన్నాడని ఎన్ఐఏ విచారణలో తేలింది. ఈ క్రమంలో అతన్ని తీసుకొని వచ్చి సోదాలు నిర్వహించినట్లు సమాచారం.

# బొగ్గు గనిలో పేలుడు: 51 మంది మృతి




టెహ్రాన్: తూర్పు ఇరాన్‌లోని బొగ్గు గనిలో మిథేన్ గ్యాస్ లీకై భారీ పేలుడు సంభవించింది. మిథేన్ గ్యాస్ లీక్ కారణంగా జరిగిన ఈ పేలుడులో రెండు బ్లాకుల్లో పని చేస్తున్న 51 మంది కార్మికులు దుర్మరణం పాలయ్యారు. మరో 20 మంది కార్మికులు గాయపడ్డారు. మృతదేహాలను వెలికితీసేందుకు, గాయపడిన కార్మికులను బయటకు తెచ్చేందుకు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఇరాన్‌లోని దక్షిణ ఖొరాసన్ ప్రావిన్స్‌లో ఈ సంఘటన జరిగింది. శనివారం రాత్రి మదంజూ కంపెనీ నిర్వహిస్తున్న బొగ్గు గనిలోని బీ, సీ బ్లాకుల్లో మీథేన్ గ్యాస్ రిలీజ్ కావడంతో పేలుడు జరిగినట్లు సౌత్ ఖొరాసన్ ప్రావిన్స్ గవర్నర్ అలీ అక్బర్ రహీమి తెలిపారు. సుమారు 51 మంది కార్మికులు మరణించగా మరో 20 మంది గాయపడినట్లు మీడియాతో అన్నారు. బీ బ్లాక్‌లో రెస్క్యూ ఆపరేషన్ పూర్తయిందని రహీమీ తెలిపారు. ఈ బ్లాక్‌లో పని చేసిన 47 మంది కార్మికుల్లో 30 మంది మరణించారని, మరో 17 మంది గాయపడ్డారని చెప్పారు. సీ బ్లాక్‌లో సహాయక చర్యలు ప్రారంభమయ్యాయని అన్నారు. ఈ బ్లాక్‌లో మీథేన్ సాంద్రత ఎక్కువగా ఉందని, రెస్క్యూ ఆపరేషన్‌కు ఎక్కువ సమయం పడుతుందని తెలిపారు. పేలుడు సమయంలో ఈ బ్లాక్‌లో 69 మంది కార్మికులు ఉన్నట్లు చెప్పారు. గాయపడిన 17 మందిని ఆసుపత్రికి తరలించామని, 24 మంది మిస్ అయ్యారని వెల్లడించారు. మరోవైపు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు. సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఇదిలావుండగా గనిలో చిక్కుకున్న మరికొంత మందిని వెలికితీసేందుకు ప్రయత్నిస్తున్నట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. ఇదే సమయంలో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ కోసం న్యూయార్క్ వెళ్లడానికి సిద్ధమైన ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ చిక్కుకున్న వారిని రక్షించడానికి, వారి కుటుంబాలకు సహాయం చేయడానికి అన్ని ప్రయత్నాలను చేయాలని ఆదేశించారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించాలని అధికారులకు దర్యాప్తునకు ఆదేశించారు.

### గతంలోనూ..

ఇరాన్ మైనింగ్ పరిశ్రమకు ఇది మొదటి విపత్తు కాదని చెప్పవచ్చు. ఎందుకంటే 2013లో రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన మైనింగ్ ప్రమాదాల్లో పదకొండు మంది కార్మికులు మరణించారు. 2009లో పలు ఘటనల్లో 20 మంది కార్మికులు చనిపోయారు. 2017లో బొగ్గు గని పేలుడులో 42 మంది మృతి చెందారు. ఈ మరణాలు తరచుగా జరుగుతుండటం పట్ల అక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేలవమైన భద్రతా ప్రమాణాలు, మైనింగ్ ప్రాంతాలలో అత్యవసర సేవలు లేకపోవడం వల్లనే ఇలా జరుగుతున్నాయని చెబుతున్నారు.

# తడబాటు ఆయన సొంతం!

## ◆తాజాగా క్వాడ్ శిఖరాగ్ర సదస్సులో జో బైడెన్ తీరిది



వాషింగ్టన్: అమెరికా వేదికగా ఆదివారం జరిగిన క్వాడ్ శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరోసారి తడబడ్డారు. ఇండో- పసిఫిక్ భాగస్వామ్యానికి సంబంధించి నిర్వహించిన సమావేశంలో క్వాడ్ నాయకులను ఉద్దేశించి బైడెన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీని పరిచయం చేసే క్రమంలో బైడెన్ తడబడ్డారు. 'నేను మీ అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఇప్పుడు ఎవరిని పరిచయం చేస్తున్నాను?' అంటూ ఒక్క క్షణం ఆగిపోయారు. తదుపరి ఎవరు? అంటూ తన సిబ్బందిని అడిగారు.

ఇక, అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఇప్పటికే పలుమార్లు తడబడ్డారు. అధ్యక్ష అభ్యర్థిగా బరిలో నిలిచిన సమయంలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన సంవాదంలో బైడెన్ తడబడ్డారు. అనంతరం నాటో కూటమి దేశాల వార్షిక సదస్సు సమయంలో మరోసారి తడబడ్డారు. నాటో కూటమి సభ్యదేశాల ప్రతినిధులకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని పరిచయం చేసే సమయంలో జెలెన్‌స్కీని ఆహ్వానిస్తూ.. 'అధ్యక్షుడు పుతిన్' అని సంబోధించారు. నాటో సదస్సు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. 'ఉపాధ్యక్షుడు ట్రంప్' అని పేర్కొన్నారు. దీంతో ఆయన మానసిక స్థితి సరిగా లేదంటూ సోషల్ మీడియా వేదికగా పలువురు విమర్శలు గుప్పించారు. ఈ తడబాట్ల కారణంగా 81 ఏళ్ల వయసులో బైడెన్ మానసిక సామర్థ్యం సన్నగిల్లుతోందని, అధ్యక్ష బరిలోంచి వైదొలగాలని సొంత పార్టీ నేతలే డిమాండ్ చేశారు. దీంతో ఆయన అధ్యక్ష అభ్యర్థిగా వైదొలిగి.. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు మద్దతు పలికారు.

# బంగ్లాదేశ్‌లో 'హిల్సా' ఎగుమతులపై నిషేధం ఎత్తివేత

## ◆భారత్‌కు 3 వేల టన్నుల హిల్సా చేపలు!

ఢాకా: బంగ్లాదేశ్ ప్రభుత్వం బెంగాలీ ప్రజలకు శుభవార్త చెప్పింది. బంగ్లాదేశ్ నుంచి హిల్సా చేపల ఎగుమతిపై నిషేధాన్ని ఎత్తివేసింది. త్వరలో 3 వేల టన్నుల పద్మాపులస చేపలను భారతదేశానికి ఎగుమతి చేసేందుకు అక్కడి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయి, తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ఏడాది భారతదేశానికి హిల్సా చేపల ఎగుమతిపై నిషేధం విధించింది. ఇప్పుడు ఆ నిషేధాన్ని ఎత్తివేసింది. కాగా, పశ్చిమ బెంగాల్‌లో దేవీ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బెంగాల్ వాసులు హిల్సాను వండుకొని తింటారు. కొంతమంది బెంగాల్ ప్రజలు వీటిని పూజల్లో నైవేద్యంగా కూడా సమర్పిస్తారు. ప్రతి ఏడు దుర్గా పూజ సమయానికి భారత్‌కు బంగ్లాదేశ్ హిల్సా చేపలను ఎగుమతి చేస్తుంది. సాధారణంగా కోల్‌కతా మార్కెట్లలో కిలో హిల్సా ధర దాదాపు వెయ్యి రూపాయలు ఉంటుంది. బంగ్లాదేశ్‌లోని పద్మా నదిలో ఈ హిల్సా చేపలు పుడతాయి. అందుకే వీటికి పద్మా పులస అనే పేరొచ్చింది. ప్రపంచంలోని దాదాపు 70 శాతం హిల్సాలు బంగ్లాదేశ్‌లోనే ఉత్పత్తి అవుతాయి. 2012లో తీస్తా నది నీటి భాగస్వామ్య ఒప్పందంపై భారత్‌కు, బంగ్లాకు మధ్య విభేదాలు తలెత్తడంతో ఈ చేపల ఎగుమతిపై నిషేధం విధించింది. ఈ కారణంగా పశ్చిమబెంగాల్ మార్కెట్లలో వీటి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. భారతదేశం-బంగ్లాదేశ్ సరిహద్దులో హిల్సా చేపల స్మగ్లింగ్ మొదలయ్యింది. దీంతో 2022లో అప్పటి బంగ్లా ప్రధాని షేక్ హసీనా నిషేధాన్ని ఎత్తివేశారు.



# శ్రీలంక అధ్యక్షుడిగా అనుర కుమార దిసనాయకే



కొలంబో: శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో మార్క్సిస్ట్ నేత అనుర కుమార దిసనాయకే (55) విజయం సాధించారు. ఆదివారం చేపట్టిన ఓట్ల లెక్కింపులో దిసనాయకే అత్యధిక మెజార్టీ సాధించి అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకున్నారు. మొత్తం పోలైన ఓట్లలో 42.31 శాతం ఓట్లు అనుర కుమార సాధించినట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది..

రెండోస్థానంలో ఉన్న విపక్షనేత సాజిత్ ప్రేమదాసకు 32.76శాతం ఓట్లు వచ్చాయి. ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే తొలి రౌండులోనే పోటీ నుంచి వైదొలిగారు. శ్రీలంక నూతన అధ్యక్షుడిగా అనుర కుమార దిసనాయకే ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) పార్టీ వెల్లడించింది.

శ్రీలంక అధ్యక్ష ఎన్నికల పోలింగ్ శనివారం జరగ్గా.. ఆదివారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. మొదట తొలి ప్రాధాన్యతా ఓట్లను లెక్కించినప్పటికీ... అందులో విజయానికి అవసరమైన 50 శాతానికి పైగా ఓట్లు ఏ అభ్యర్థికీ రాలేదు. దీంతో గెలుపును నిర్ధరించేందుకు రెండో రౌండ్ కౌంటింగ్ చేపట్టారు. ఇందులో మార్క్సిస్ట్ నేత కుమార దిసనాయకే విజయం సాధించారు.

### చరిత్రలో తొలిసారి..

అధ్యక్ష ఎన్నికల్లో భాగంగా ఓటర్లు ప్రాధాన్య క్రమంలో ముగ్గురు అభ్యర్థులకు ఓటు వేశారు. తొలి ప్రాధాన్య ఓట్లలో 50శాతానికిపైగా ఓట్లు సాధించినవారు విజేతగా నిలుస్తారు. గెలుపునకు అవసరమైన 50శాతం ఓట్లు ఎవరికీ రాకుంటే రెండు, మూడో ప్రాధాన్య ఓట్లను లెక్కించడం ద్వారా విజేతను నిర్ణయిస్తారు. శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో రెండో రౌండ్ లెక్కించే పరిణామం గతంలో ఎన్నడూ ఎదురుకాలేదు. మొదటి ప్రాధాన్య ఓట్ల సమయంలోనే విజేత ఎవరో ఖరారయ్యేవారు. ఈసారి మాత్రం ఎవరికీ స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించాల్సి వచ్చిందని ఎన్నికల అధికారులు వెల్లడించారు.

## అత్యంత ప్రమాదకరం.. పారో విమానాశ్రయం

భూటాన్: ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన విమానాశ్రయాల్లో భూటాన్‌లోని పారో ఎయిర్ పోర్టు ఒకటి. ఇక్కడ చుట్టూ 18,000 అడుగుల ఎత్తున హిమాలయ పర్వతాలుంటాయి. ఈ విమానాశ్రయంలో ల్యాండింగ్ పైలట్లకు పెను సవాల్. ప్రపంచ వ్యాప్తంగా కేవలం 50 మంది పైలట్లు మాత్రమే ఈ విమానాశ్రయంలో ల్యాండ్ చేయడానికి అర్హత సాధించారు. రన్వే పొడవు కూడా కేవలం 7,431 అడుగులు మాత్రమే. చిన్న విమానాలకు మాత్రమే ల్యాండింగ్ సాధ్యం. దీనికి రాడార్ గైడెన్స్ లేకుండా నడపడానికి తగిన శిక్షణ కూడా పొందిన పైలట్లు అవసరం. ఒక చిన్న తప్పు కూడా విమాన ప్రమాదానికి కారణమవుతుంది. సాధారణంగా పారో ఎయిర్ పోర్టులో ల్యాండింగ్కు అర్హత పొందిన పైలట్లు కేటగిరి-సి కిందకు వస్తారు. వీరిని ఏవియేషన్ పరిశ్రమలో వేరెవిల్స్ పోలుస్తారు.



భూటాన్ 97 శాతం భూభాగం పర్వతాలతో నిండిపోయి ఉంటుంది. ఇక పారో విమానాశ్రయం సముద్ర మట్టానికి 7,382 అడుగుల ఎత్తున ఉంటుంది. వాతావరణ మార్పులు, గాలి సాంద్రతలో తేడాల కారణంగా మధ్యాహ్నం వేళ ఇక్కడ విమాన ప్రయాణాలను పైలట్లు సాధ్యమైనంత వరకు వాయిదా వేస్తారు. ఇక వర్షాకాలంలో గోల్ఫ్‌బాల్ సైజు వడగళ్లు ఇక్కడ సర్వసాధారణం. రాడార్ సిగ్నల్స్ సరిగ్గా పనిచేయకపోవడంతో రాత్రివేళల్లో విమానాలను అనుమతించరు.